




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 149 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 10 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 149 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 10 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# ప్రజాభిప్రాయం మేరకే బీఆర్ఎస్ పార్టీలోకి...

- బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా: కేటీఆర్‌తో భేటీ అనంతరం జీవన్ రెడ్డి
- బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్తుకు పాటుపడవచ్చని వ్యాఖ్య
- శేషజీవితంలో కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం వచ్చిందన్న జీవన్ రెడ్డి
- జీవన్ రెడ్డి నివాసానికి చేరుకుని పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**తాను బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నానని జగిత్యాల మాజీ ఎమ్మెల్యే, ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన జీవన్ రెడ్డి ప్రకటించారు. శేషజీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీతో కలిసి పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్తు కోసం కూడా పాటుపడవచ్చని పేర్కొన్నారు.అంతకుముందు, జగిత్యాలలో జీవన్ రెడ్డిని బీర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కలిశారు. హైదరాబాద్ నుంచి జగిత్యాలకు చేరుకున్న కేటీఆర్... జీవన్ రెడ్డితో ఆయన నివాసంలో గంటకు పైగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేటీఆర్ వెంట ఎల్. రమణ, పాడి కౌశిక్ రెడ్డి, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

**నిఖార్సైన జీవన్ రెడ్డి వంటి నేతలను కాంగ్రెస్ అవమానిస్తోంది: కేటీఆర్**

మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. గురువారం జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లిన కేటీఆర్ ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు కేటీఆర్. జీవన్ రెడ్డి వంటి నిఖార్సైన నేతలను కాంగ్రెస్ అవమానిస్తోందని అన్నారు. జీవన్ రెడ్డిని కేసీఆర్ సూచన మేరకు మా సహచరులందరితో కలిసి సాదరంగా ఆహ్వానించేందుకు వచ్చామని అన్నారు. 2014 ఎన్నికలకు ముందే కేసీఆర్ జీవన్ రెడ్డిని ఆహ్వానించారని.. కానీ, నిబద్ధత గల నాయకుడిగా ఆయన కాంగ్రెస్ తోనే కొనసాగారని అన్నారు కేటీఆర్. కేసీఆర్, జీవన్ రెడ్డి బంధం ఈనాటిది కాదని అన్నారు. జూన్ 2, 2014లో ముఖ్యమంత్రిగా పదవి చేపట్టాక మొట్టమొదటి సారి జగిత్యాలకు వచ్చారని.. ఆరోజు బోర్నపల్లి బ్రిడ్జి గురించి జీవన్ రెడ్డి కేసీఆర్ ను అడిగారని... ఆయనడిగిందే తడవుగా కరీంనగర్ జిల్లాలో మొట్టమొదటి సాంక్షన్ ఇచ్చారని అన్నారు కేటీఆర్. షుగర్ ఫ్యాక్టరీపై జీవన్ రెడ్డి ఫైట్ చేశారని.. ఆ క్రమంలోనే కేసీఆర్ మహారాష్ట్ర తరహా కో ఆపరేటివ్ సొసైటీ పద్ధతిలో పెడదామన్నారని.. పార్టీ బలోపేతానికి జీవన్ రెడ్డి చేరిక బాగుంటుందని జగిత్యాల నాయకత్వం కూడా మద్దతు తెలిపిందని అన్నారు కేటీఆర్. కాలం నెట్టుకొచ్చే ప్రభుత్వం ఇది అని..మూడు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారని అన్నారు కేటీఆర్. 70 లక్షల కోట్లు రైతులకు బకాయి పడ్డారని.. బాసరలో ముఖ్యమంత్రి భాష అసహ్యంగా ఉందని అన్నారు.



## పవన్ ఖేరా అరెస్ట్‌పై ఉత్కంఠ...
# తీర్పు రిజర్వ్ చేసిన తెలంగాణ హైకోర్టు

- అసోం సీఎం భార్యపై ఆరోపణల కేసులో పవన్ ఖేరాకు అరెస్ట్ ముప్పు
- అరెస్ట్ నుంచి తాత్కాలిక రక్షణ కోరుతూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్
- ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, తీర్పు రిజర్వ్
- నేడు వెలువడనున్న తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ
- ఇది రాజకీయ కక్ష సాధింపేనని ఖేరా తరఫు న్యాయవాది వాదన

మిగతా 2లో



# కాళేశ్వరం బ్యారేజీల మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**కాళేశ్వరం ప్రాజెక్టులోని 3 బ్యారేజీలకు మరమ్మతులను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులు పూర్తిచేయాలని అధికారులకు ఆయన సూచించారు. కాళేశ్వరం మరమ్మతులపై నీటి పారుదలశాఖ ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు సమావేశానికి హాజరయ్యారు."బ్యారేజీల మరమ్మతులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలి. వీలైనంత త్వరగా పనులు వేగవంతం చేయాలి. ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలి. ఏజెన్సీలన్నింటినీ అప్రమత్తం చేసి పనుల్లో వేగం పెంచాలి. వర్షాకాలానికి ముందే పరీక్షలు, నమూనాల సేకరణ పూర్తి చేయాలి. సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, నీటిపారుదలశాఖ, డిజైన్ కన్సల్టేషన్స్‌తో బృందం ఏర్పాటు చేయాలి. ప్రతి పనిలో సీడబ్ల్యూసీ సభ్యులు ఉండేలా చూడాలి. బ్యారేజీల మరమ్మతులకు సంబంధించి డిజైన్‌లు, డిసెంబర్‌లోపు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలి. నిధుల కొరత రానివ్వం.. పనుల్లో జాప్యం జరగడానికి వీల్లేదు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. పనులు ప్రారంభమయ్యాక స్వయంగా వచ్చి పరిశీలిస్తా"అని సీఎం అన్నారు.



## సెల్ఫీ మోజులో విషాదం...
# జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినుల మృతి

- అల్లూరి జిల్లా అనంతగిరిలో విషాద ఘటన
- సెల్ఫీ తీసుకుంటూ జలపాతంలో పడి ముగ్గురు బాలికల మృతి
- మరో విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం
- మృతులు హుకుంపేట మండలానికి చెందిన ఇంటర్ విద్యార్థినులు
- ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:**అల్లూరి సీతారామరాజు జిల్లాలో విషాద ఘటన చోటుచేసు కుం ది. సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో అదుపుతప్పి జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినులు ప్రాణాలు

మిగతా 2లో

## కేరళ, అసోం, పుదుచ్చేరిలో ముగిసిన పోలింగ్...
# ఫలితాలపై సర్వత్రా ఆసక్తి

- ప్రశాంతంగా ముగిసిన కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- పుదుచ్చేరిలో రికార్డు స్థాయిలో నమోదైన ఓటింగ్ శాతం
- కేరళలో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న మూడు ప్రధాన కూటములు
- వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ భారీగా పోలింగ్
- మే 4న ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసిన ఎన్నికల సంఘం

మిగతా 2లో



# వడ్ల కొనుగోలుకు మరో 60 రోజులు గడువు ఇవ్వండి...

### కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ..

**హైదరాబాద్ పెన్ పవర్:**వరి కొనుగోలు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. రబి 2024-25కు 5 లక్ష మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ టార్గెట్ పెట్టాలని..ఎఫ్‌సీఐ రా రైస్ టార్గెట్ తగ్గించాలని సూచించారు మంత్రి ఉత్తమ్. 8.45 లక్ష మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీ ఇంకా పెండింగ్ ఉందని.. ఇప్పటికే గడువు

మిగతా 2లో





## లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు...
# హెజ్బొల్లా చీఫ్ మేనల్లుడి హతం

- హెజ్బొల్లా నేత నయీమ్ ఖాసిం కార్యదర్శి అలీ యూసఫ్ హర్షీ హతం
- బీరుట్‌లో దాడి చేసి హతమార్చిన ఇజ్రాయెల్ సైన్యం
- అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం మరుసటి రోజే ఈ ఘటన
- లెబనాన్‌లో 100కు పైగా హెజ్బొల్లా స్థావరాలపై దాడులు

మిగతా 2లో

# శత్రువులు మాపై విజయం సాధించలేరు

### ఇరాన్ అణు ఇంధన సంస్థ అధిపతి

- కాల్పుల విరమణ ప్రతిపాదనలో యురేనియం శుద్ధి అంశాన్ని వ్యతిరేకిస్తోన్న అమెరికా
- అణు ఇంధనాన్ని పరిరక్షించుకోవడం తమ హక్కు అన్న మొహమ్మద్ ఎస్లామీ
- ఇరాన్ హక్కుల పరిరక్షణ అత్యవసరమని వ్యాఖ్య

మిగతా 2లో






# ఇంటర్ ఫలితాలపై ఆ వార్తలు నమ్మొద్దు


### తెలంగాణ విద్యాశాఖ

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇంటర్ ఫలితాలను ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవమూ లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాల ప్రకటన నిర్ణీత

మిగతా 2లో

# జీవన్ రెడ్డి ఇంటి వద్ద తోపులాట..

### జర్నలిస్టులకు గాయాలు



- జగిత్యాలలోని జీవన్ రెడ్డి ఇంటికి వెళ్లిన కేటీఆర్, గంగుల, కొప్పుల
- భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు
- అదుపుతప్పి జర్నలిస్టులపై పడిపోయిన వైనం
- ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ఖరీదైన మెరాలు ధ్వంసం
- కార్యక్రమాన్ని బాయ్ కాట్ చేసిన మీడియా ప్రతినిధులు

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# సిద్ధాంతాలతో రాజీపడని నేత

తాను నమ్మిన సిద్ధాంతాలతో ఏనాడూ రాజీ పడని విలక్షణ వ్యక్తిత్వం దివంగత ప్రధాని మొరార్జీ దేశాయ్ కే సొంతం. మొరార్జీ దేశాయ్ దృష్టిలో నిజాయితీ అనేది ఒక విశ్వాసం తప్ప అవసరం కాదు. ఎట్టి పరిస్థితుల్లో అయినా ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి ఉండేవారు. క్లిష్టమైన సందర్భాల్లో కూడా ఆయన రాజీపడిన దాఖలాలు లేవు. 'జీవితంలో ప్రతి ఒక్కరూ నిజాయితీకి కట్టుబడి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్న ధర్మ సూత్రాన్ని' మొరార్జీ దేశాయ్ ఆచరించి చూపించారు. ధృఢమైన గంధేయవాదిగా దేశాయ్, ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ సోషలిస్టు విధానాలకు వ్యతిరేకంగా సామాజిక సంప్రదాయ వాదిగా, అనుకూల - వ్యాపార, ఉచిత సంస్థ సంస్కరణలకు అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎదిగిన దేశాయ్, అవినీతి వ్యతిరేక అంశాలతో తీవ్ర జాతీయ వాదిగా, ప్రధానమంత్రి నెహ్రూ, అయన మిత్రపక్షాలను విభేదించారు. 1927-28 గోద్రాలో జరిగిన అల్లర్ల సమయంలో హిందువులపై మెతక వైఖరి అవలంభించాననే అపరాధ భావంతో మే1930న అతను గోద్రా డిప్యూటీ కలెక్టరు ఉద్యోగానికి రాజీనామా చేసారు. వివాదం లేకుండా ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలు గడిపిన గొప్ప నాయకుడు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన తరువాత, ఆయన ఎప్పుడూ క్రియాశీలక రాజకీయాల వైపు తిరిగి చూడలేదు. మొరార్జీ దేశాయ్ బొంబాయి రాజ్యంలో (ప్రస్తుతం గుజరాత్) బ్లస్టర్ జిల్లాకు చెందిన భదేలీ గ్రామంలో 1896 ఫిబ్రవరి 29 న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ముంబైలోని విల్సన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేసిన తరువాత ఆయన గుజరాత్ లో సివిల్ సర్వీసులో చేరారు. మహాత్మాగాంధీ అధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. తన తెలివైన నాయకత్వ నైపుణ్యాల వల్ల స్వాతంత్ర్య సమర యోధులందరికీ అభిమాని అయ్యారు. గుజరాత్ ప్రాంతంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు ముఖ్యమైన నాయకుడయ్యారు .1934, 1937 లలో ప్రాంతీయ ఎన్నికలు జరిగినప్పుడు, ఆయన బొంబాయి ప్రెసిడెన్సీలో వరుసగా రెవెన్యూమంత్రి, హోంమంత్రి బాధ్యతలను చేపట్టారు.1952లో బొంబాయి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకో బడ్డారు. బొంబాయి రాష్ట్రం ద్వి భాషా రాష్ట్రంగా ఉండేది. బొంబాయి రాష్ట్రంలో గుజరాత్, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు. పార్లమెంటులో ఎనిమిది వార్షిక మరియు రెండు మధ్యంతర బడ్జెట్లను ప్రదర్శిస్తూ మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రికార్డును కలిగి ఉన్నారు. 1964 మరియు 1968 లో ఫిబ్రవరి 29 న రెండు కేంద్ర బడ్జెట్లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆయనకు ప్రత్యేకమైన ప్రత్యేకత ఉంది, ఇది అయన పుట్టినరోజు కావడం గమనార్హం. దేశాయ్ ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఉప ప్రధాన మంత్రిగా సేవల నందించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టారు. బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హోం మంత్రి, ఆర్థిక మంత్రి, ప్రతిపక్ష నేత పదవులతొ పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టారు. 1977 మార్చి 24వ తేది మొరార్జీ దేశాయి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవల నందించారు. భారత రాజకీయ చరిత్రలో 81 సంవత్సరాల వయసులో ప్రధాని పదవిలో ఉన్న నేత. అలాగే కాంగ్రెసేతర ప్రధానిగా పదవి చేపట్టి, 1979 లో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. రెండున్నర సంవత్సరాలు (మార్చి 1977 నుండి జూలై 1979 వరకు) మాత్రమే ప్రధానిగా ఉన్నారు. దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచిన నేతగా చరిత్రలో మిగిలి పోయారు. అత్యధిక పౌర పురస్కారాలను అందుకున్న ఏకైక భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. పాకిస్తాన్ సంబంధిత అత్యున్నత పౌర పురస్కారం... నిషానే - ఎ - పాకిస్తాన్ - 1986లో గెలుచుకున్న ఏకైక భారతీయుడు. 1991లో భారత రత్న పురస్కారం పొందారు. అలా భారత దేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు మొరార్జీ. మొరార్జీ దేశాయ్ జనతాపార్టీకి 1980 సార్వత్రిక ఎన్నికలలో సీనియర్ రాజకీయ నాయకుడిగా ప్రచారం చేశారు, కాని ఎన్నికలో పోటీ చేయలేదు. అయన "యూరిన్ థెరపీ"ని అభ్యసించే వారు. 1978లో "మూత్ర చికిత్స" దీర్ఘకాలిక అభ్యాసకుడైన దేశాయ్ డేంరాథర్ తో "60 మినిట్స్" కార్యక్రమంలో మాట్లాడుతూ మూత్రం త్రాగడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య చికిత్స పొందలేని లక్షల మంది భారతీయులకు మూత్ర చికిత్స అనేది పరిపూర్ణ వైద్య పరిష్కారం అని దేశాయ్ వివరించారు. స్వ మూత్రం తాగడం ద్వారా తన దీర్ఘాయువుని కాగలిగానని చెప్పారు. దీనిని "జీవజలము" అని పిలిచారు. దేశాయ్ 1896 లో జన్మించారు. పదవీ విరమణ తరువాత అయన ముంబైలో నివసించి సంతోషంగా గడిపి, 1995 లో 99 సంవత్సరాల వయసులో మరణించారు. దేశాయ్ తన 100 వ పుట్టిన రోజుకు కొద్ది నెలల వ్యవధిలో 1995 ఏప్రిల్ 10 న కన్ను మూశారు. అత్యధిక కాలం జీవించిన దివంగత భారత ప్రధానిగా పేరు గడించారు. పాశ్చాత్య సాంప్రదాయం ప్రకారం పుట్టిన తేదీన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ప్రతి ఏడూ అలా పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన పుట్టిన తేదీన భారత దేశంలోనూ జన్మదినం సందర్భంగా వేడుకలు జరుపుకోవడం సర్వసాధారణం. అయితే భారత దేశ చరిత్రలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, వివిధ పదవులను అలంకరించి, దాదాపు శత సంవత్సరాలు జీవించిన ఒక గొప్ప నాయకునికి అలాంటి అవకాశం లేకుండా పోయింది. అందుకే ఆ దివంగత గొప్ప నాయకుని జన్మదినం చాలా మందికి గుర్తుండదు. ఆయనే దివంగత భారత ప్రధాని మొరార్జీ దేశాయ్. కారణం ఆయన ఫిబ్రవరి 29వ తేదీన జన్మించడమే. లీపు సంవత్సరము అయితే తప్ప ఆయనది ప్రాతి సంవత్సర జన్మదినం కాకపోవడమే. నాలుగు ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫిబ్రవరి 29 రావడం కావడమే. జన్మదిన ప్రత్యేకత లాగే పలు విధ ప్రత్యేకతల సమాహారం మొరార్జీ జీవితం. మొరార్జీ దేశాయ్ పండిన 99 ఏళ్ళ వయసు వరకు జీవించినా, ఫిబ్రవరి 29 న జన్మించి నందున అయన తన జీవిత కాలంలో కేవలం 24 పుట్టిన రోజులను మాత్రమే చూసి, 25వది రావడానికి కొద్ది రోజుల ముందు కన్ను మూశారు.

# వడ్ల కొనుగోలుకు మరో 60 రోజులు గడువు ఇవ్వండి...

- మొదటి పేజి తరువాయి
ముగిసిన క్రమంలో మరో 60 రోజులు గడువు పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు ఉత్తమ్. ఐదు శాతం బ్రోకెన్స్‌తో బాయిల్డ్ రైస్ సరఫరాకు మిల్లర్ల అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు మంత్రి ఉత్తమ్. ఖమీ 2025-26కు బాయిల్డ్ రైస్ టార్గెట్ 20 నుంచి 40 ↄమీలకు పెంచాలని డిమాండ్ చేశారు మంత్రి ఉత్తమ్. ఖరీఫ్ లో 71.86 ↄమీలు, రబిలో 95 ↄమీల ప్యాడీ అంచనా వేశామని అన్నారు ఉత్తమ్. పెరిగిన ఉత్పత్తికి సరిపడా టార్గెట్లు లేవని రాష్ట్రం ఆందోళనలో ఉందని అన్నారు. కేంద్రం టార్గెట్లు తగ్గించడంతో నిల్వలు పెరుగుతున్నాయని.. రైతులకు MSP కల్పించేందుకు నిరంతర కొనుగోలు అవసరం ఉందని.. అదనపు ప్యాడీతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. మరో 2 నెలల గడువు పెంచాలని కోరారు.

# ఇంటర్ ఫలితాలపై ఆ వార్తలు నమ్మొద్దు

- మొదటి పేజి తరువాయి
షెడ్యూల్ ప్రకారమే జరుగుతుందని విద్యాశాఖ స్పష్టంచేసింది. ఇంతకుముందు ఎప్పుడూ ఏప్రిల్ మొదటి వారంలో ఇంటర్ ఫలితాలు విడుదల కాలేదన్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసింది. అలాగే, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి గతేడాది వరకు జరిగిన ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసిన తేదీలను ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ 'ఫ్యాక్ట్‌చెక్' విభాగం 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టింది. "ఇంటర్ ఫలితాలు 2014లో మే 3వ తేదీన విడుదల కాగా.. 2015లో ఏప్రిల్ 22న, 2016లో ఏప్రిల్ 22న, 2017లో ఏప్రిల్ 16న, 2018లో ఏప్రిల్ 13న, 2019లో ఏప్రిల్ 18న, 2020లో జూన్ 18న (కొవిడ్ ఎఫెక్ట్‌తో అందరినీ పాస్ చేశారు), 2021లో జూన్ 28న (కొవిడ్ కారణంగా అందరినీ పాస్ చేశారు), 2022లో జూన్ 28న, 2023లో మే 9న, 2024లో ఏప్రిల్ 24న, 2025లో ఏప్రిల్ 22న ప్రకటించారు" అని పేర్కొంది. "సమాధాన పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాల ఆధారంగా ఫలితాలను ప్రకటించే తేదీలు ఏటా మారుతుంటాయనే విషయాన్ని గ్రహించాలి. మూల్యాంకనం పూర్తయ్యే సమయం ఆధారంగానే ఫలితాలు విడుదల చేస్తారు. ఇంటర్ ఫలితాల విషయంలో విద్యాశాఖ ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మాలి. సామాజిక మాధ్యమాల్లో ప్రచారమయ్యే తప్పుడు వార్తలను నమ్మొద్దు" అని తెలంగాణ విద్యాశాఖ కోరింది. అలాగే, తప్పుడు సమాచారం వ్యాప్తి చేయడాన్ని ఆపాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేసింది.

## కేరళ, అసోం, పుదుచ్చేరిలో ముగిసిన పోలింగ్...

# ఫలితాలపై సర్వత్రా ఆసక్తి

కేరళ, అసోం రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. మూడు ప్రాంతాల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ అధికారికంగా ముగిసినప్పటికీ, పలు కేంద్రాల్లో ఓటర్లు క్యూలలో వేచి ఉండటంతో వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపును మే 4వ తేదీన చేపట్టనున్నారు.

**కేరళలో గెలుపుపై ఎవరి ధీమా వారిదే**

ప్రజాస్వామ్య పండుగగా అభివర్ణించే ఎన్నికల పర్వానికి కేరళలో గురువారం సాయంత్రం 6 గంటలకు అధికారికంగా తెరపడింది. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో సాయంత్రం 5 గంటల సమయానికి 75.01 శాతం ఓటింగ్ నమోదైంది. కోజికోడ్ జిల్లాలో అత్యధికంగా 77.63 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 75.75 శాతం పోలింగ్ నమోదవగా, ఈసారి కూడా తుది సంఖ్య 80 శాతం మార్కును దాటుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. అదే జరిగితే, 1987 తర్వాత 80 శాతం ఓటింగ్ దాటడం ఇదే తొలిసారి అవుతుంది. పోలింగ్ ముగియడంతో, ఇప్పుడు అందరి దృష్టి మే 4న జరగబోయే ఓట్ల లెక్కింపుపైనే ఉంది. రాబోయే ఐదేళ్లపాటు రాష్ట్ర సచివాలయాన్ని ఎవరు శాసిస్తారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్), తమ ప్రస్తుత 99 సీట్ల కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేసింది. మరోవైపు, కాంగ్రెస్ సీనియర్ నేత ఏకే ఆంటోనీ, వీడీ సతీశన్ వంటి నేతల సారథ్యంలోని ప్రతిపక్ష యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్), 100 సీట్ల మార్కును దాటి అధికారంలోకి వస్తామని ధీమాగా చెబుతోంది. ఈ రెండు కూటములకు భిన్నంగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ హంగ్ అసెంబ్లీ ఏర్పడుతుందని అంచనా వేశారు. 2016లో ఒక్క సీటు గెలిచి, 2021లో దాన్ని కోల్పోయిన బీజేపీ అంచనాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి.

**పుదుచ్చేరిలో రికార్డు బ్రేకింగ్ పోలింగ్**

మరోవైపు, 30 అసెంబ్లీ స్థానాలున్న పుదుచ్చేరిలో రికార్డు స్థాయి ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటలకే 86.92 శాతం పోలింగ్ నమోదవడం విశేషం. ఇది 2006లో నమోదైన 86 శాతం రికార్డును అధిగమించింది. తుది పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం ఉంది. మొత్తం 9.5 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో మహిళా ఓటర్లే అధికం.

అధికార ఎన్డీఏ కూటమి (ఏఐఎన్ఆర్‌సీ నేతృత్వంలో), ప్రతిపక్ష ఇండియా కూటమి (కాంగ్రెస్, డీఎంకే, వీసీకే) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీరితో పాటు నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవ?ఈ), సీమాన్ నేతృత్వంలోని నామ్ తమిళ్ కట్చి (ఎన్టీకే) కూడా బరిలో నిలవడంతో పోటీ ఆసక్తికరంగా మారింది.

**అసోం, ఇతర ఉప ఎన్నికల్లోనూ భారీగా ఓటింగ్**

అసోంలోని 126 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు 84.42% పోలింగ్ నమోదైంది. సౌత్ సల్మారా మంకాచార్ జిల్లాలో అత్యధికంగా 94.08% ఓటింగ్ నమోదైంది. ఇక వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. కర్ణాటకలోని బాగల్‌కోట్‌లో 65.68%, దావణగెరె సౌత్‌లో 63.04%, నాగాలాండ్‌లోని కోరిడాంగ్ స్థానంలో 80.62%, త్రిపురలోని ధర్మనగర్‌లో 79.84% పోలింగ్ నమోదైంది. ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లోని అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. మే 4వ తేదీ ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా, మధ్యాహ్నానికి ఫలితాలపై స్పష్టత రానుంది. అప్పటి వరకు ఉత్కంఠ కొనసాగనుంది.

## పవన్ ఖేరా అరెస్ట్‌పై ఉత్కంఠ...

# తీర్పు రిజర్వ్ చేసిన తెలంగాణ హైకోర్టు

కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరాకు అరెస్ట్ నుంచి తాత్కాలిక ఊరట లభిస్తుందా లేదా అనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ భార్య రినికి భూయాన్ శర్మపై పరువు నష్టం కలిగించే ఆరోపణలు చేశారన్న కేసులో, తనను అరెస్ట్ చేయకుండా మధ్యంతర రక్షణ కల్పించాలని కోరుతూ పవన్ ఖేరా దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు గురువారం తన తీర్పును రిజర్వ్ చేసింది. జస్టిస్ కె. సుజన శుక్రవారం ఈ తీర్పును వెలువరించే అవకాశం ఉంది.

అసోం పోలీసులు నమోదు చేసిన కేసు నేపథ్యంలో, అక్కడి కోర్టులను ఆశ్రయించేందుకు వీలుగా తనకు ట్రాన్సిట్ యాంటిసిపేటరీ బెయిల్ మంజూరు చేయాలని ఖేరా తన పిటిషన్‌లో కోరారు. ఖేరా తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, అసోం పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆరోపించారు. అయితే, అసోం అడ్వకేట్ జనరల్ దేవాజిత్ సైకియా ఈ వాదనలను వ్యతిరేకించారు. ఢిల్లీ నివాసి అయిన ఖేరా, హైదరాబాద్‌లో ముందస్తు బెయిల్ పిటిషన్ ఎందుకు దాఖలు చేశారో సరైన కారణాలు చూపలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రినికి భూయాన్ శర్మకు పలు విదేశీ పాస్‌పోర్టులు, విదేశాల్లో ప్రకటించని ఆస్తులు ఉన్నాయని పవన్ ఖేరా ఇటీవల ఓ ప్రెస్‌మీట్‌లో సంచలన ఆరోపణలు చేశారు. దీనిపై అసోం పోలీసులు ఆయనపై పరువునష్టం, ఫోర్జరీ, నేరపూరిత కుట్ర వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 14 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఢిల్లీలోని ఖేరా నివాసానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేరు. మరోవైపు, హైదరాబాద్‌లోని ఆయన భార్య నీలిమ ఇంటి వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో, అజ్ఞాతం నుంచి పవన్ ఖేరా ఒక వీడియో ప్రకటన విడుదల చేశారు. ఆయనపై, ఆయన భార్యపై వచ్చిన ఆరోపణలకు సీఎం సమాధానం చెప్పాలే తప్ప, పోలీసులను అడ్డుపెట్టుకోవడం సరికాదని అన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడనని, రాహుల్ గాంధీ సైనికుడిగా ప్రశ్నలు అడుగుతూనే ఉంటానని స్పష్టం చేశారు.

## శత్రువులు మాపై విజయం సాధించలేరు

తమపై ఆంక్షలు విధించిన శత్రువులు విజయం సాధించలేరని ఇరాన్ అణు ఇంధన సంస్థ అధిపతి మొహమ్మద్ ఎస్లామీ అన్నారు. కాల్పుల విరమణ ప్రతిపాదనల్లో యురేనియం శుద్ధి అంశాన్ని అమెరికా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ, అణు ఇంధనాన్ని పరిరక్షించుకోవడం తమ హక్కు అని స్పష్టం చేశారు. ఇరాన్ హక్కుల పరిరక్షణ అత్యవసరమని వ్యాఖ్యానించారు. అమెరికాతో జరిపే ఎటువంటి కాల్పుల విరమణ చర్చల్లోనూ తమ హక్కుల పరిరక్షణే అత్యవసర అంశంగా ఉండాలని చెప్పారు. తమపై ఆంక్షలు విధిస్తే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం అమెరికా, ఇరాన్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించిన విషయం తెలిసిందే. అయితే లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడితో ఉద్రిక్త పరిస్థితులు తిరిగి తలెత్తాయి.

## లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు...

# హెజ్బొల్లా చీఫ్ మేనల్లుడి హతం

లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) దాడులను తీవ్రతరం చేసింది. హెజ్బొల్లా చీఫ్ నయీమ్ ఖాసిం మేనలుడు అలీ యూసఫ్ హర్షీని బీరుట్‌లో హతమార్చినట్లు ఐడీఎఫ్ నేడు ప్రకటించింది. హర్షీ... నయీమ్ ఖాసింకు వ్యక్తిగత కార్యదర్శి కూడా. అమెరికా, ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన మరుసటి రోజే ఈ దాడి జరగడం ఉద్రిక్తతలకు దారితీసింది.

ఈ మేరకు 'ఎక్స్'లో ఐడీఎఫ్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఖాసిం కార్యాలయ నిర్వహణలో, భద్రత కల్పించడంలో హర్షీ కీలక పాత్ర పోషించాడని, అతడు అత్యంత సన్నిహితుడు, వ్యక్తిగత సలహాదారు అని తెలిపింది. ఈ దాడితో పాటు, లిటాని నదికి దక్షిణంగా ఆయుధాలను తరలించడానికి హెజ్బొల్లా ఉపయోగించే రెండు కీలక క్రాసింగ్‌లతో పాటు, దక్షిణ లెబనాన్‌లో 10 ఆయుధ నిల్వ కేంద్రాలు, లాంచర్లు, కమాండ్ సెంటర్లను కూడా ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ పేర్కొంది. ఉత్తర ఇజ్రాయెల్ భద్రత విషయంలో రాజీపడబోమని, హెజ్బొల్లాపై దాడులను మరింత కఠినంగా కొనసాగిస్తామని ఐడీఎఫ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఈయల్ జమీర్ స్పష్టం చేశారు. ప్రతి కార్యాచరణ అవకాశాన్ని ఉపయోగించుకుంటామని ఆయన హెచ్చరించారు. కాగా, లెబనాన్ పై దాడుల వీడియోను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. "మా సందేశం సుస్పష్టం... ఎవరైతే ఇజ్రాయెల్ పౌరులపై దాడులకు పాల్పడతారో వారిని నాశనం చేస్తాం" అంటూ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

## సెల్ఫీ మోజులో విషాదం... జలపాతంలో పడి ముగ్గురు విద్యార్థినుల మృతి

- మొదటి పేజి తరువాయి
కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన అనంతగిరి మండలం మూలగుమ్మి సమీపంలోని జలపాతం వద్ద జరిగింది. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళితే, హుకుంపేట మండలం జుంబువలస గ్రామానికి చెందిన త్రిష (17), రత్నకుమారి (16), పవిత్ర (16) ఇటీవల ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. మరో స్నేహితురాలు అంజలితో కలిసి నలుగురూ అనంతగిరిలోని జలపాతాన్ని చూసేందుకు వెళ్లారు. అక్కడ జలపాతం అంచున నిలబడి సెల్ఫీ దిగుతుండగా, ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో పడిపోయారు. ఈ ప్రమాదంలో త్రిష, రత్నకుమారి, పవిత్ర అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన అంజలిని స్థానికులు గమనించి లుంగపర్తి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఒక్కసారిగా ముగ్గురు బాలికలు మృతి చెందడంతో వారి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## జీవన్ రెడ్డి ఇంటి వద్ద తోపులాట.. జర్నలిస్టులకు గాయాలు

జగిత్యాలలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా ఉద్రిక్తతకు దారితీశాయి. మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసం వద్ద జరిగిన తోపులాటలో మీడియా ప్రతినిధులు గాయపడటం, వారి పరికరాలు ధ్వంసం కావడం తీవ్ర కలకలం రేపింది.

వివరాల్లోకి వెళితే... కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ తదితరులతో కలిసి జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు ఒక్కసారిగా లోపలికి దూసుకురావడంతో అక్కడ తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. అదుపుతప్పిన కార్యకర్తలు అక్కడ విధుల్లో ఉన్న మీడియా ప్రతినిధులపై పడిపోవడంతో పలువురు జర్నలిస్టులకు గాయాలయ్యాయి. తోపులాటలో ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన ఖరీదైన వీడియో కెమెరాలు కిందపడి ధ్వంసమయ్యాయి. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన మీడియా ప్రతినిధులు, ఆ కార్యక్రమాన్ని బాయ్ కాట్ చేసి నిరసన తెలిపారు.

# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్



బహుదూర్‌పల్లిలో అక్రమ సెల్లార్‌తో అదనపు అంతస్తుల నిర్మాణం..

# బహుదూర్‌పల్లి డివిజన్‌లో... బహుళ అంతస్తులు

### ఈ అక్రమ నిర్మాణాల వెనుక ఓ చైన్‌మెన్ చక్రం తిప్పుతున్నట్టు ఆరోపణలు..

- మొదట పర్మిషన్‌లు మంజూరు చేయించి ఆతర్వాత అండగా ఉండటం..
- ఈ డివిజన్‌లోని ప్రతి అక్రమ బహుళ అంతస్తుల వెనుక ఆ చైన్‌మెన్ కీలకపాత్ర.?
- మొన్నటి ఏసిబి దాడుల్లో తప్పించుకున్న ఆ చైన్‌మెన్‌కు కీలక బాధ్యతలు అప్పగింత..?
- మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ సిబ్బందే అయినా బిల్డర్ వద్ద పట్టున్న చైన్‌మెన్..
- ఓ ఇద్దరు అధికారుల అండతో, అన్నీతానై అక్రమ కట్టడాల వసూళ్ళలో కీలకం..?

**బహుదూర్‌పల్లిలో 4 బహుళ అంతస్తుల నిర్మాణం..అందులో ఒకటి అక్రమ సెల్లార్..**

**అదే డివిజన్ పరిధి దొమ్మర పోచంపల్లిలో 10-20 వరకు అక్రమ నిర్మాణాలు..**

**గండిమైసమ్మలోని సర్వే నెంబర్ 168లో దాదాపు 8 అనుమతుల్లేని నిర్మాణాలు..**

వెంటేశ్వరస్వామి ముడుపులు 'తిరుపతి' హుండీలో వేసిన చందంగా దుండిగల్ సర్కిల్-59 సిఎంసి టౌన్‌ప్లానింగ్ వ్యవస్థ తయారైందని సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. బహుదూర్‌పల్లి డివిజన్-294లో, బహుదూర్‌పల్లి, గండిమైసమ్మ, దొమ్మర పోచంపల్లిలో అక్రమ నిర్మాణాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి.. టౌన్‌ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.. ప్రమాదకర అక్రమ నిర్మాణాలు- 22-ఎ నిషేధిత భూముల్లో బహుళ అంతస్తులపై, అధికారులు-చైన్‌మెన్‌లు పర్యవేక్షణ లేకుండా పోయిందన్న వాదనలు ఉన్నాయి.. వీరందరిని కేవలం ఒక్క చైన్‌మెన్ మేనేజ్ చేస్తున్నట్టు తెలుస్తోంది.. అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు జరిగి నెల కూడా గడవలేదు.. మళ్ళీ వసూళ్ళకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.. అక్రమ కట్టడాల జాబితా గ్రాఫ్ విపరీతంగా పెరుగుతోందని, స్థానికులు చెబుతున్నారు.. అనుమతులు మంజూరు చేయించడం మొదలుకుని, అక్రమ సెల్లార్‌లు, అదనపు అంతస్తుల నిర్మాణం, సెట్‌బ్యాకుల నిబంధనల ఉల్లంఘించినలో చైన్‌మెన్ అక్రమార్కులకు, అండగా నిలుస్తున్నారని తెలుస్తోంది.. ముడుపులతో మేనేజ్ చేసే సత్తా వున్న ఆ చైన్‌మెన్ దుండిగల్ సర్కిల్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం.. ఆర్థిక లావాదేవీలు చక్కబెట్టడంలో, ఆరితేరి పోయారని చెబుతున్నారు.. సంబంధిత చైన్‌మెన్ లేకపోతే..! ఆ సర్కిల్‌లో 'ఆర్థిక సంక్షోభం' ఏర్పడినా ఆశ్చర్యం లేదని పలువురు ఎద్దేవా చేస్తున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 9:

-4లో



బహుదూర్‌పల్లిలో అట్టహాసంగా సీజ్ చేసిన నిర్మాణంలో పనులు..

### ఉమ్మడి ఖమ్మం జిల్లా రైల్వే సమస్యలపై ఎంపీ రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవ

6లో...

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# దుండిగల్ సర్కిల్.. బహుదూర్‌పల్లిలో అగ్నిప్రమాదం..

### ఫ్లవర్ డెకరేషన్ సామాగ్రి నిల్వ ఉంచిన గోదాములో అనుమానాస్పద మంటలు..



- దుండిగల్ సర్కిల్ పరిధి గ్రీన్‌హిల్స్ కాలనీలో అగ్నిప్రమాద ఘటన..
- ఫ్లవర్ డెకరేషన్ గోములో సుమారు రూ.కోటి విలువైన సామాగ్రి బూడిద..
- పక్కనే ఉన్న హాస్టల్ భవనానికి కూడా మంటలు వ్యాపించి కాలిపోయింది..
- అగ్నిప్రమాదం పరిసర కాలనీలకు వ్యాపించిన దట్టమైన పొగ..



బహుదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలో అగ్ని ప్రమాదం..

**దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 9:** దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫ్లవర్ డెకరేషన్ సామాగ్రి నిల్వ ఉంచిన గోదాములో అకస్మాత్తుగా మంటలు చెలరేగి క్షణాల్లోనే భారీగా వ్యాపించాయి. గోదాంలో ఉన్న అధిక పరిమాణంలోని ప్లాస్టిక్ వస్తువులు, అలంకరణ సామాగ్రి కారణంగా మంటలు ఎగిసిపడి దాదాపు కిలోమీటర్ విస్తీర్ణంలో పరిసర ప్రాంతాన్ని కమ్మేశాయి.. మంటలు అదుపు తప్పడంతో గోదాం పక్కనే ఉన్న హాస్టల్‌లోకి మంటలు వేగంగా వ్యాపించాయి. ఈ ఘటనతో కాలనీలో నివసిస్తున్న ప్రజలు భయాందోళనకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.. మంటల వల్ల ఏర్పడిన దట్టమైన పొగ మొత్తం కాలనీలో వ్యాపించి, కొంతసేపు ఊపిరి పీల్చుకోవడానికే ఇబ్బందిగా మారింది.. స్థానికుల సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు శ్రమించారు. అయితే అప్పటికే గోదాంలో నిల్వ ఉంచిన ఫ్లవర్ డెకరేషన్ సామాగ్రి పూర్తిగా దగ్ధమైంది. గోదాం వద్ద నిలిపి ఉంచిన ఒక వాహనం కూడా పూర్తిగా మంటల్లో కాలిపోయిందని బాధితులు వాపోయారు.. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై స్పష్టత రాకపోయినప్పటికీ, షార్ట్ సర్క్యూట్ లేదా నిర్లక్ష్యం కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.




# జీడిమెట్లలో కెమికల్ గోదాములో అగ్నిప్రమాదం..

- అక్రమ వ్యర్థ రసాయనాలు నిల్వలతో ప్రమాదాలు..చ
- జీడిమెట్ల పారిశ్రామిక వాడను తరలించడంలో నిర్లక్ష్యం..!
- తరచూ అగ్నిప్రమాదాలతో భయభ్రాంతులకు గురవుతున్న స్థానికులు..
- బొలెరో, ద్విచక్రవాహనం దగ్ధం.. కాలనీ మొత్తం దట్టమైన విషపూరిత పొగ..

-5 లో

# బహుదూర్‌పల్లి డివిజన్‌లో.. బహుళ అంతస్తులు..



బహుదూర్‌పల్లిలో మరో అక్రమ నిర్మాణంలో పరదాల చాటున పనులు..


బహుదూర్‌పల్లి అదనపు అంతస్తుల అక్రమ నిర్మాణంలో అదనంగా మరో రెండు అంతస్తులు..


దొమ్మర పోచంపల్లిలో అక్రమ నిర్మాణం..

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంటనే స్పందించి దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ విభాగంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.. ఏసిబి దాడులు జరిగినా, అధికారుల తీరులో మార్పు కనిపించడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. ఇంతకు ముందు కంటే ఇప్పుడు అవినీతి రెట్టింపు అయిందని, సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.. కూల్చిన తాజా హోటల్ పక్కన అక్రమ నిర్మాణం మళ్ళీ నిర్మించినా.. కూల్చేసిన బహుదూర్‌పల్లి షెడ్డు పూర్తిచేసినా..! నోటీసులు ఇచ్చినా, సీజింగ్‌లు చేసిన నిర్మాణాలకు బేరం కుదుర్చుకుని ముడుపులతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు సాధారమై పోయాయి.. ప్రమాదకర అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడం దుండిగల్ సర్కిల్‌లో సర్వసాధారణంగా మారిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. ప్రస్తుతం ఉన్న అధికారులను బదిలీ చేస్తే అయినా మార్పు వస్తుందేమోనని స్థానికులు అంటున్నారు..**


బహుదూర్‌పల్లిలో అధికారులు కూల్చివేశామని చెబుతున్న 1500 గజాల అక్రమ షెడ్డు..

## మభ్యపెట్టే చర్యలతో.. ముడుపులు వసూళ్ళు..

టౌన్‌ప్లానింగ్ చర్యలు అంటేనే అధికారుల చేతివాటానికి అనుకూలంగా ఉంటాయని నిరూపిస్తున్నారు.. టిజి-బిపాస్ చట్టాన్ని చుట్టంగా మలుచుకుని, ధనార్జనే ధ్యేయంగా ఔట్ సోర్సింగ్ సిబ్బందిని, చైన్‌మెన్‌ను విధుల్లో వాడుకుంటున్నది.. వసూళ్ళ కోసమేనని అనుమానాలు తలెత్తుతున్నాయి..పత్రికల్లో వార్తలు రాగానే, బిల్డ్‌నవ్ చట్టపరంగా షోకాజ్ నోటీసులు, సీజింగ్‌లు, టౌన్‌ప్లానింగ్ విభాగం స్టైల్లో పాక్షిక కూల్చివేతలు సాధారణమయ్యాయి.. ఇవ్వన్నీ టౌన్‌ప్లానింగ్ అధికారుల తాత్కాలిక చర్యలే.. అయినప్పటికీ, అక్రమ నిర్మాణాలలో ఏమాత్రం మార్పు ఉండదు.. "కూల్చింది పూడ్చేయడం- కావల్సిన ముడుపులు పుచ్చుకోవడం".. బహిరంగమే అయినప్పటికీ, ప్రశ్నించే పైఅధికారులు లేరు.. కారణం అందరికీ వాటాలు వెళ్తుంటాయని పలు సందర్భాల్లో ఆ కీలక చైన్‌మెన్ చెపుతున్నారని తెలిసింది..

- 3 పేజి తరువాయి

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దుండిగల్ సర్కిల్-59 టౌన్‌ప్లానింగ్ విభాగంలో చర్యల ప్రస్తావనే లేదన్న విమర్శలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి.. ప్రమాదకర అక్రమ నిర్మాణాలకు అండగా నిలిచి, అధికారులు-చైన్‌మెన్‌లు డబ్బులు దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.. బహుదూర్‌పల్లి-గండిమైసమ్మ- దొమ్మర పోచంపల్లిలో దాదాపు 20 వరకు అక్రమ నిర్మాణాలు దర్శనమిస్తాయి.. బహుదూర్‌పల్లి గ్రామ పరిధిలో 1500 గజాల భారీ అక్రమ షెడ్డు నిర్మాణంపై పత్రికల్లో వార్తాకథనాలు వచ్చాయి.. దీంతో 'ఫొటోషూట్' కోసం జేసిబితో చర్యలు చేపట్టి మమః అనిపించారు.. ఈ అక్రమ షెడ్డుకు సహకరించిన యంత్రాంగానికి రూ.లక్షల్లో ముడుపులు ముట్టాయని చెబుతున్నారు.., చెక్కుచెదరని సంబంధిత అక్రమ షెడ్డే నిదర్శనమని స్థానికంగా చర్చించుకుంటున్నారు..బహుదూర్‌పల్లిలో దుండిగల్ టౌన్‌ప్లానింగ్ అట్టహాసంగా సీజ్ చేసిన శ్రీకాంత్ గుప్త నిర్మాణంలో దర్జాగా సాగుతున్నాయి.. పనులు చేస్తుండగా..! నోటీసులు ఇచ్చాం కదాని అధికారులు బుకాయిస్తున్న మరో అక్రమ నిర్మాణానికి గ్రీన్‌మ్యాట్ పరదాలు కట్టి పనులు కానిచ్చేస్తున్నారు.. దీనికి టౌన్‌ప్లానింగ్ అధికారుల అండ లేకుంటే సాధ్యమేనా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి.. బహుదూర్‌పల్లి రహదారిపై దాదాపు 350 గజాల నిర్మాణంలో "అక్రమ సెల్లార్-అదనపు అంతస్తులు" సెట్‌బ్యాకులు జీరో.. ఇలా ప్రతి నిర్మాణం అక్రమంగా నిర్మించడంలో ముడుపులే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు..


టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చేసి న అక్రమ నిర్మాణం పూర్తి..


గండిమైసమ్మలో

## గండిమైసమ్మ-దొమ్మర పోచంపల్లిలో..

దుండిగల్ సర్కిల్ సిఎంసి పరిధి బహుదూర్‌పల్లి డివిజన్-294లోని గండిమైసమ్మ, దొమ్మర పోచంపల్లిలో అక్రమ షెడ్లు, బహుళ అంతస్తుల నిర్మాణంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుగ్రహంతో, ఆ కీలక చైన్‌మెన్ కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయని సమాచారం..! ఇండస్ట్రియల్ జోన్‌లో అనుమతులు ఇప్పించడంలోనూ ఓ చైన్‌మెన్ పాత్ర కీలకంగా ఉన్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.. ఒక్క దొమ్మర పోచంపల్లి లోనే 20 అక్రమ నిర్మాణాలు ఉన్నాయి.. జీహెచ్‌ఎంసిలో విలీనమైన తర్వాత అక్రమ నిర్మాణాల కరప్షన్ తారా స్థాయికి చేరుకుందని విమర్శలు వస్తున్నాయి..

- జీడిమెట్ల పారిశ్రామిక వాడను తరలించడంలో నిర్లక్ష్యం..!
- తరచూ అగ్నిప్రమాదాలతో భయభ్రాంతులకు గురవుతున్న స్థానికులు..
- బొలెరో, ద్విచక్రవాహనం దగ్ధం.. కాలనీ మొత్తం దట్టమైన విషపూరిత పొగ..


జీడిమెట్లలో అగ్నిప్రమాదం

# జీడిమెట్లలో కెమికల్ గోదాములో అగ్నిప్రమాదం



## అక్రమ వ్యర్ధ రసాయనాలు నిల్వలతో ప్రమాదాలు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఏప్రిల్ 9:** కుత్బుల్లాపూర్ పరిధిలోని జీడిమెట్ల పారిశ్రామిక వాడలో అక్రమ కెమికల్ దందా ప్రాణాంతకంగా మారింది. నిబంధనలు పట్టించుకోని గోదాములు.. పెరుగుతున్న కెమికల్ వ్యర్థాల నిల్వలపై కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పర్యవేక్షణ లేమితో కెమికల్ వ్యాపారం మూడు పూవులు ఆరుకాయలుగా సాగుతోంది.. ఈ కెమికల్ వ్యర్థాలతో స్థానికుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. గురువారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో జీడిమెట్ల రామిరెడ్డి నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన సాల్వెంట్ కెమికల్ గోదాములో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గోదాములో నిల్వ చేసిన కెమికల్ డ్రమ్ములు పేలి రోడ్లపైకి ఎగిరిపడ్డాయి.. భారీ శబ్దాలతో మంటలు విస్తరించగా, ఆ ప్రాంతమంతా దట్టమైన నల్లని విషపూరిత పొగలు కమ్ముకుని భయాందోళనకు గురిచేశాయి. ఏం జరుగుతుందో అర్థం కాక స్థానికులు గందరగోళానికి లోనయ్యారు..



### అధికారుల వైఫల్యంతో ప్రమాదాలు..

సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి రెండు ఫైర్ ఇంజిన్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే ఈ ప్రమాదంలో ఒక బొలెరో వాహనం, ఒక ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు పక్కనే ఉన్న పరిశ్రమలకు వ్యాపించకుండా అధికారులు అప్రమత్తం అయ్యారు.. ఇటీవల కాలంలో జీడిమెట్ల ప్రాంతంలో అక్రమ కెమికల్ గోదాములు పెరిగిపోవడంతో ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాతే స్పందించే అధికారుల వైఖరిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాణాలతో ఆటలాడుతున్న ఈ అక్రమ కెమికల్ వ్యాపారాలపై ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకుంటారా..? లేక మరిన్ని ప్రమాదాలకు అవకాశం ఇస్తారా అంటూ ప్రశ్నలు తలెత్తుతున్నాయి



# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు :మంత్రి సీతక్క

**గార్ల పెన్ పవర్ ఏప్రిల్ 9:** దళారుల వల్ల రైతులు మోసపోవద్దని తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటుచేసిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు గురువారం మండల పరిధిలోని సీతంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం లో రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములై ప్రజలకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించి వారిని సద్వినియోగం చేసుకునే విధంగా కృషి చేయాలని సూచించారు

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు సీతంపేట సర్పంచ్ వీరు నాయక్ గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పార్వతి హతీరాం నాయక్ అధ్యక్షులు వడ్లమూడి దుర్గాప్రసాద్ అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధనియాకుల రామారావు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఉమ్మడి ఖమ్మం జిల్లా రైల్వే సమస్యలపై ఎంపీ రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవ

- డోర్నకల్- మిర్యాలగూడ, డోర్నకల్ - గద్వాల రైల్వే లైన్ల అలైన్మెంట్ మార్చాలి
- ప్రత్యామ్నాయంగా వెన్నారం, కురవి, అబ్బాయి పాలెం, మరిపెడ, మోతె మీదుగా ఏర్పాటు చేయండి
- కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఎదుట రహదారి విస్తరణకు భూ మార్పిడి చేపట్టండి
- ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఈడీని కోరిన రామసహాయం
- రైల్వే నుంచి సానుకూల స్పందనతో.. త్వరలోనే పెండింగ్ పనులకు మోక్షం



**ఏదిలాపురం(ఖమ్మం), పెన్ పవర్, ఏప్రిల్ 9:** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలపై ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్, రైల్వే బోర్డ్ చైర్మన్, సికింద్రాబాద్ రైల్వే జీఎంలను కలిసిన విషయం విదితమే. ఈ క్రమంలో తాజాగా గురువారం ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) వికాస్ కుమార్ జైన్ ను కలిసి కీలక సమస్యలను వివరించారు. కొత్త రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాల పెంపుపై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి సానుకూల స్పందన లభించిందని ఎంపీ తెలిపారు.

**ప్రత్యామ్నాయ రైల్వే లైన్లు చేపట్టాల్సిందే..**

పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల మీదుగా వెళ్ళనున్న డోర్నకల్ - మిర్యాలగూడ, డోర్నకల్ - గద్వాల రీ అలైన్మెంట్ల కోసం గతంలో పలు విజ్ఞాపనలు చేశామని, రైల్వే అధికారులు సర్వే కూడా పూర్తి చేశారని గుర్తు చేశారు. సానుకూల స్పందన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా వెన్నారం, కురవి, అబ్బాయిపాలెం, మరిపెడ, మోతె మీదుగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాల్సిందిగా విన్నవించారు. ఇందుకోసం వేగవంతంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ నుంచి న్యూ గొల్లగూడెం మీదుగా జాతీయ రహదారి అంశం ప్రస్తావన, భూ మార్పిడి పై విన్నపం రోడ్డు విస్తరణకు కొత్తగూడెం (బీడీసీఆర్) స్టేషన్ వద్ద 4,556 చ.మీ. (5,449 చదరపు గజాలు) రైల్వే భూమి అవసరమని, ఈ భూమికి బదులుగా ఖమ్మం రైల్వే స్టేషన్ వద్ద 9,969.5 చ.మీ. రాష్ట్ర ప్రభుత్వ భూమిని రైల్వేకు ఇచ్చేందుకు సిద్ధమని వివరించారు. ఈ మేరకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్ల నుంచి దక్షిణ మధ్య రైల్వేకు 2025, నవం బర్ 14న ప్రతిపాదనలు పంపినట్లు వివరించారు.

# దోమల నియంత్రణకు ఫాగింగ్ చర్యలు



PEN POWER 24 NEWS పెన్ పవర్ తెలుగు దిన పత్రిక ప్రశ్నించడం మన హక్కు

ఫాగింగ్ లేకపాయే దోమలు పెరిగిపోయే

గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 8: మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో ఉన్న ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు మొలిచి మురుగు కాలువల్లో నిలిచిన చెత్తాచెదారంతో నీరు నిలువ ఉండటంతో దోమలు ఆవాసాలుగా చేసు కొని సంతతి పెరగటానికి కారణమై పగలు రాత్రి తేడా లేకుండా దోమల విజృంభనతో కంటిమీద కునుకు లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు దోమల స్వైర విహారంతో ఆరుబయట సైతం నిల్చోలేని పరిస్థితి నెలకొందని దోమల నివారణకు కనీసం కాలువలలో బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని ప్రజా ప్రతినిధులు ఉన్నతా ధికారులు గ్రామంలో పర్యటించినప్పుడు మాత్రమే బ్లీచింగ్ పౌడర్ చల్లించి పంచాయతీ అధికారులు చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారుతుందని దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగి ప్రతిఏటా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన ప్రాణాలు కోల్పోతున్నప్పటికి వాటిని నివారించేందుకు గ్రామపంచాయతీ అధికారులు చేస్తున్న కృషి అంతంత మాత్రంగానే ఉందని ఆరోపి స్తున్నారు పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా దోమల్నిఅరికట్టేందుకు గ్రామ పంచాయతీ కీ ఫాగింగ్ యంత్రం ఉన్నప్పటికీ ఫాగింగ్ యంత్రంతో దోమల మందు పిచికారి చేయడం లేదని ప్రజల ఆరో గ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారని వాపోతున్నారు ఫ్రైడే డ్రైడే ద్వారా దోమల నియంత్రణ చర్యలను చేపట్టాల్సి ఉండగా మొక్కుబడిగా చేపడుతూ ప్రజారోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని. మండిపడుతున్నారు ఇప్పటికైనా స్థానిక సర్పంచ్ పంచాయతీ అధికారులు స్పందించి దోమల నివారణకు వార్డులలో ఫాగింగ్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

epaper.penpower.in | 2026-04-09 | Page: 4
For more details, visit epaper.penpower.in



పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

**గార్ల, పెన్ పవర్ ఏప్రిల్ 9:** ఫాగింగ్ లేకపోయే దోమలు పెరిగిపోయే వ్యాధుల బారిన పడుతున్న చిన్నారులు వృద్ధులు ప్రాణాలు పోతే గాని పట్టించుకోరా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు అని గురువారం పెన్ పవర్ దిన పత్రికలో వెలువడిన కథనానికి స్పందన లభించింది స్పందించిన గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతి ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని అన్ని వార్డులలో దోమల నియంత్రణకు ఫాగింగ్ చర్యలు చేపట్టారు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ జ్వరాల తో హాస్పిటల్ పాలవుతున్నారు దోమల స్వైర విహారంతో పగలు రాత్రి తేడా లేకుండా కంటిమీద కునుకు లేకుండా పోతుందని ఆరు బయట సైతం నిల్చోలేని పరిస్థితి నెల కొందని ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజల సమస్యను అధి కారుల దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా దోమల నియంత్రణ చర్యలు చేపట్టే విధంగా కృషిచేసిన పెన్ పవర్ దినపత్రిక రిపోర్టర్ యాజమాన్యానికి ప్రజలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కవిత, షర్మిలకు బంగారం వంటి అవకాశాలు



**హైదరాబాద్, ఏప్రిల్ 9, పెన్ పవర్**

రాజకీయాల్లో అవకాశాలు రావాలి. కాలం కలిసొస్తే మంత్రి పదవి కూడా చేపట్టకుండా కనీసం ఎమ్మెల్యే కూడా కాకుండా ముఖ్యమంత్రి అయిపోవచ్చు. ఎంపీ కాకుండానే ప్రధాని పదవిలో కూర్చోవచ్చు.ఇవన్నీ ఈ దేశంలో జరిగాయి. ఇక తెలుగు రాజకీయాల్లో చూస్తే ఇప్పటిదాకా పురుషాధిపత్యం సాగుతోంది. మహిళా రాజకీయ నాయకురాళ్ళు ఉన్నారు కానీ వారు ద్వితీయ స్థానాలకే పరిమితంఅవుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు ప్రముఖ రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వైఎస్ షర్మిల, కల్వకుంట్ల కవిత ఇద్దరూ తమ రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.ఈ ఇద్దరూ సొంతకుటుంబాలను వ్యతిరేకిస్తూ సొంత రాజకీయం చేస్తున్నారు. ఇందులో షర్మిల అయితే తెలంగాణాలో వైఎస్సార్ టీపీని స్థాపించి కొన్నాళ్ళు అక్కడ రాజకీయం చేశారు. చివరికి ఆ పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసి 2024 ఎన్నికల ముందు ఏపీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అయ్యారు. ఆమె తానుగా గెలవకపోయినా వైసీపీని ఓడించారు. దాంతో పాటు వైసీపీకి రాయలసీమలో పెద్ద దెబ్బ తగిలి ఏకంగా విపక్ష స్థానానికి సైతంసరిపడా సీట్లు దక్కకుండా 11 సీట్లకే పరిమితమై చతికిలపడింది. ఇక ఏపీ కాంగ్రెస్ కి ఆమె ప్రెసిడెంట్ గా తనదైన శైలిలో పనిచేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ఓటు బ్యాంక్ అంతా కాంగ్రెస్ దే కావడం దానిఅధినేత జగన్ కావడంతో వైఎస్సార్ వారసురాలిగా షర్మిలను పీసీసీ పీఠం మీద ఉంచితే ఎంతో కొంత కాంగ్రెస్ కి ఓటు బ్యాంక్ దక్కుతుందన్న ఆలోచనలో కాంగ్రెస్ పెద్దలు జాతీయ స్థాయిలో ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. ఈ క్రమంలో ఏపీలో అదనంగా మరో యాభై శాతం సీట్లు పెరుగుతాయని అంటున్నారు. అంతే కాదు మొత్తం సీట్లలో మూడవ వంతు మహిళలకు రిజర్వేషన్ అంటున్నారు. అంటే ఏపీలో263 సీట్లు పెరిగితే అందులో 88 సీట్ల దాకా విమెన్ రిజర్వేషన్ కిందకు వస్తుంది. ఈ సీట్లలో పోటీ చేయడానికి మహిళా నాయకురాళ్ళు రెడీగా ఉండాల్సిందే. ఇప్పటికే కీలకమైన స్థానాల్లో ఉన్న వారికి ఈ సీట్లపెరుగుదల రిజర్వేషన్లు అన్నవి అతి పెద్ద బూస్టింగ్ గా అని చెబుతున్నారు. మరీ ముఖ్యంగా కడప జిల్లాలో పది సీట్లు పదిహేను అవుతాయని అంటున్నారు. అయిదు సీట్లు మహిళలకు దక్కుతాయి.కడప అంటే వైఎస్సార్ ఫ్యామిలీకి కంచుకోట. 2024 లో కడప ఎంపీ సీటుకు షర్మిల పోటీ చేశారు. లక్షన్నర ఓట్లు తెచ్చుకున్నారు. ఇపుడు పెద్ద నియోజకవర్గాలు చిన్నవిగా మారితే మహిళా రిజర్వేషన్లుఅయితే షర్మిలకు కుటుంబ నేపథ్యం, రాజకీయంగా పరిస్థితులు అనుకూలించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఆమె మీద బలమైన అభ్యర్థులను ప్రత్యర్థులు వెతకాల్సి ఉంటుంది. లేకపోతే స్టేట్ వైడ్ లీడర్ గా ఉన్న షర్మిల జాగ్రత్తగా చేసుకుంటే గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టడం కష్టం కాబోదు అని అంటున్నారు. కవిత తెలంగాణాలో కొత్త పార్టీని స్థాపించబోతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో కొత్తగా సీట్లుపెరగడం చిన్న అసెంబ్లీ నియోజకవర్గాలుగా మారడం కలిసి వచ్చే అంశమే అంటున్నారు. అక్కడ కూడా 59 దాకా సీట్లు మహిళా రిజర్వేషన్ల రూపంలో దక్కనున్నాయి. కవిత జనంలో ఉంటున్నారు తండ్రి కేసీఆర్ మాదిరిగానే ఫైర్ బ్రాండ్ గా ఉంటున్నారు. దాంతో ఆమె తనతో పాటు కొందరు మహిళా నేతలను కనుక జాగ్రత్తాగ ఎంపిక చేసుకుంటే రిజర్వ్ సీట్లలో గెలుచుకోగలరని అంటున్నారు. అలాగే ఇమేజ్ఉన్న నాయకులు ఆమె పార్టీలో చేరితే చతుర్ముఖ పోరులో చిన్న నియోజకవర్గాల్లో ఓట్లు అటు నుంచి ఇటు అయితే గెలిచే వీలు ఉంటుందని లెక్క వేస్తున్నారు. మొత్తానికి కవిత పార్టీకి ఇది శుభారంభం అని అంటున్నారు. ఏది ఏమైనా మహిళా రాజకీయ నాయకురాళ్ళుగా పట్టుదలగా పోరాడుతున్న కవిత షర్మిల రాజకీయ జాతకాన్ని మార్చే విధంగా పునర్ విభజన కానీ మహిళా రిజర్వేషన్ కానీ ఉండబోతున్నాయా అంటే వేచి చూడాల్సిందే అంటున్నారు.

## ఉద్యోగ భర్తీకి ఈనెల 10న ఇంటర్వ్యూ

**కొత్తగూడెం, ఏప్రిల్ 9 పెన్ పవర్:** భద్రాద్రి జిల్లా నిరుద్యోగులకు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ శుభవార్త అందించారు. హైదరాబాదులోని ఒక ప్రైవేటు కంపెనీలో 50 కేర్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, 8వ తరగతి ఆపై చదివిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. జీతం రూ.16,500 నుండి రూ.22 వేల వరకు ఉంటుందని, 18 నుండి 35 ఏళ్ల మధ్య వయస్సు గలవారు ఈనెల 10న ఉదయం 10 గంటలకు చుంచుపల్లి ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు జన్మదిన వేడుకలు

**పినపాక, ఏప్రిల్ 9 పెన్ పవర్:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం సీతారామపురం గ్రామంలోని వృద్ధాశ్రమంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేసి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కోడి అమరేందర్ యాదవ్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, కార్యకర్తలు పాల్గొని రేగా కాంతారావుకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ వార్త 2026 ఏప్రిల్ 9న నమోదైంది.

## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణి




**ఇల్లందు, ఏప్రిల్ 9 పెన్ పవర్:** ఇల్లందు మండల, మున్సిపాలిటీ పరిధిలో 129 మంది లబ్ధిదారులకు కోటి 29 లక్షల 14 వేల 964 రూపాయల విలువైన కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం అందజేశారు. పేదింటి ఆడబిడ్డలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని, కాంగ్రెస్ పాలనలో పేదలకు మేలు జరుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన కార్పొరేటర్ ఆకాంక్ష పడాల

**భద్రాచలం, ఏప్రిల్ 9 పెన్ పవర్:** కొత్తగూడెం జిల్లా, పాత కొత్తగూడెం, 11వ డివిజన్ లో గురువారం ఉదయం కార్పొరేటర్ ఆకాంక్ష పడాల డంపింగ్ యార్డ్ ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వీర భద్ర చారి, శానిటరీ ఇన్స్పెక్టర్ అహ్మద్ పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్ ను పరిశీలించిన కార్పొరేటర్, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చవద్దని సూచించారు. ప్లాస్టిక్ కాల్చడం వల్ల ఓజోన్ పొర పలుచబడుతుందని ఆమె తెలిపారు.

## ఏనుమాముల మార్కెట్లో నిలిచిపోయిన కాంటాలు

**వర్ధన్నపేట, ఏప్రిల్ 9 పెన్ పవర్:** వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో కొనుగోళ్లు నిలిచిపోయాయి. గాయత్రీ చిల్లీస్ యజమాని తిరుపతి మూడు కోట్ల రూపాయలతో పరారీ అవ్వడంతో వ్యాపారులు ఆందోళనకు దిగారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో మార్కెట్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. పలువురు వ్యాపారులకు ఐటీ నోటీసులు అందాయి. గతంలో జమ్మికుంట్ల మార్కెట్లో కూడా తిరుపతి ఐపీ పెట్టినట్లు వ్యాపారులు తెలిపారు. దీంతో మిర్చి కాంటాలు నిలిచిపోయాయి.

## ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

**జనగామ, ఏప్రిల్ 9 పెన్ పవర్:** జనగామలో 99 రోజుల 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గురువారం ఎయిడ్స్ పై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. నెహ్రూ పార్క్ నుండి కలెక్టరేట్ వరకు సాగిన ఈ ర్యాలీని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధిగ్రస్థుల పట్ల వివక్ష చూపవద్దని కోరారు. ఈ ర్యాలీలో మెడికల్ కాలేజీ విద్యార్థులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## గంటలకుంటలో ట్రెంచ్ తవ్వకాలు ఆపాలి: దావూద్

**మహబూబాబాద్, ఏప్రిల్ 9 పెన్ పవర్:** ములుగు జిల్లా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దావూద్, ఆదివాసి గూడాలపై ఫారెస్ట్ అధికారులు చేపడుతున్న ట్రెంచ్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గంటలకుంటలో ఏళ్లుగా సాగు చేస్తున్న పోడు భూములను ఫారెస్ట్లో కలపడం అన్యాయమని, ప్రజలు పనులకు వెళ్లిన సమయంలో ఈ చర్యలు చేపట్టడాన్ని ఖండించారు. ప్రస్తుతం సాగులో ఉన్న భూములను వదిలి, కొత్త పోడును నిరోధించాలని ఆయన కోరారు.

## కాలనీ సమస్యలు పరిష్కరించండి: సీపీఎం

**పాలకుర్తి, ఏప్రిల్ 9 పెన్ పవర్:** జనగామ పట్టణంలోని మూడవ వార్డు సాన్ మేరియా స్కూల్ గేట్-1 కాలనీలో నెలకొన్న మౌలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిది గోపి డిమాండ్ చేశారు. గురువారం, మున్సిపల్ ఏఈ వంశీకృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించిన గోపి, కాలనీలో రోడ్లు, మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

## పాలకుర్తిని కప్పేసిన పొగ మంచు!

**స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 9 పెన్ పవర్:** జనగామ జిల్లా పాలకుర్తిలో గురువారం ఉదయం విభిన్న వాతావరణం నెలకొంది. ఒకవైపు 40 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండగా, అకస్మాత్తుగా పొగమంచు పట్టణాన్ని కప్పేసింది. ఎండ వేడిమి, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు చల్లటి వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. పొగమంచు కారణంగా వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నడకకు వెళ్లేవారు ఈ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆనందిస్తున్నారు.

## దేవులవాడలో భారీ వాహనాల తనిఖీలు

**బెల్లంపల్లి, ఏప్రిల్ 9 పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లిలోని కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవులవాడలో గురువారం, ఏప్రిల్ 9, 2026న, సీపీ అంబర్ కిషోర్ ఝా, డిసిపి ఏ. భాస్కర్ ఆదేశాల మేరకు జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల్లో 37 వాహనాలను సీజ్ చేసి, 2000 లీటర్ల బెల్లపు పానకాన్ని ధ్వంసం చేశారు. అలాగే, 70 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ కార్యకలాపాలకు పాల్పడిన ఏడుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్స్పెక్టర్ బన్సీలాల్, సీఐ ఆర్. కృష్ణ, ఎస్సైలు సుబ్బారావు, రాజశేఖర్, జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవు

**చెన్నూరు, ఏప్రిల్ 9 పెన్ పవర్:** జైపూర్ మండలంలోని ఇందారం నుంచి జైపూర్ వైపు అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను రసూల్ పల్లి వద్ద ఆర్ఐ తిరుపతి పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను జైపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ తిరుపతి హెచ్చరించారు. అక్రమంగా ఇసుక రవాణా చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## లక్షేటిపేట అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

**మంచిర్యాల, ఏప్రిల్ 9 పెన్ పవర్:** లక్షెట్టిపేట మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాంద్రపు తిరుపతి (48) అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు ఎస్సై సురేష్ తెలిపారు. తిరుపతికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఏడాది క్రితం కుటుంబ కలహాలతో అతని భార్య పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోవడంతో అప్పటినుంచి మద్యానికి బానిసయ్యాడు. అతిగా మద్యం సేవించి, సమయానికి అన్నం తినక మృతి చెంది ఉంటాడని అతని తల్లి రామక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## యువకుడి అనుమానాస్పద మృతి కలకలం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 9 పెన్ పవర్:** చింతల మానేపల్లి మండలం శివపల్లిలో మహారాష్ట్రకు చెందిన కునాల్ బాబురావు అవుత్కార్ అనే యువకుడి మృతదేహం లభ్యం కావడం కలకలం రేపింది. మంగళవారం ఒక యువతితో కలిసి బైక్‌పై వచ్చిన కునాల్, శవమై కనిపించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. యువకుడి మృతికి గల కారణాలను పోస్టుమార్టం నివేదిక తర్వాత వెల్లడిస్తామని ఎస్సై జీవన్ తెలిపారు. ఈ ఘటనపై మరింత సమాచారం పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడికానుంది.

## పూనగూడలో తాగునీటి కష్టాలు తీర్చిన మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

**సిర్పూర్, ఏప్రిల్ 9 పెన్ పవర్:** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలం పూనగూడ గ్రామంలో ఎండాకాలంలో తాగునీటి కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించడానికి మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సహకారంతో గ్రామంలో నూతన బావిని తవ్వించారు. భారీ జెసిబి యంత్రంతో బావి తవ్వకాలు చేపట్టగా, ఈ ఖర్చులను ఆత్రం సక్కు స్వయంగా భరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వర్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## భార్య ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తకు 5 ఏళ్ల జైలు

**కోరుట్ల, ఏప్రిల్ 9 పెన్ పవర్:** కోరుట్లలో భార్యను వేధింపులకు గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించిన భర్తకు మెట్పల్లి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి డి.నాగేశ్వరరావు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు. గంధం స్వామి మద్యానికి బానిసై భార్య లక్ష్మిని తరచూ వేధించేవాడు. కూలీ డబ్బుల గొడవలో “పోయి చచ్చిపో” అంటూ ప్రేరేపించడంతో లక్ష్మి నిప్పంటించుకుని మృతి చెందింది. కేసులో నిందితుడు దోషిగా తేలడంతో కోర్టు జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధించారు.

## బడిబాటతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికకు పిలుపు



**జగిత్యాల, ఏప్రిల్ 9 పెన్ పవర్:** జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం వి. వి రావుపేటలో గురువారం ‘మన ఊరు – మన బడి’ నినాదంతో బడిబాట కార్యక్రమం జరిగింది. బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఇంగ్లిష్ మీడియం బోధన, స్కాలర్ షిప్స్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## కోరుట్ల బిజెపి నాయకులకు సురభి నవీన్ కుమార్ దిశానిర్దేశం

**ధర్మపురి, ఏప్రిల్ 9 పెన్ పవర్:** బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రెండవసారి బాధ్యతలు స్వీకరించిన అనంతరం, కోరుట్ల పట్టణానికి మొదటిసారిగా వస్తున్న సందర్భంగా, జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ బిజెపి నాయకులు, కార్యకర్తలు సురభి నవీన్ కుమార్ గారికి ఘన స్వాగతం పలికారు. మెట్ పల్లి అయ్యప్ప స్వామి దేవాలయం నుండి బైక్ ర్యాలీగా బయలుదేరి, కోరుట్ల పట్టణంలోని వారి ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు. కోరుట్ల బస్ స్టేషన్ ఔట్ గేట్ వద్ద జరిగిన కార్నర్ మీటింగ్ లో సురభి నవీన్ కుమార్ మాట్లాడుతూ, బిజెపి కార్యకర్తల పార్టీ అని, కార్యకర్తలు లేకుంటే నాయకులు లేరని అన్నారు.

## ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచులు

**మంథని, ఏప్రిల్ 9 పెన్ పవర్:** చిల్లపల్లి, దుబ్బపల్లి సర్పంచుల అభ్యర్థన మేరకు, మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాలు, ఖీఉ 1-ఉఓ ఏరియా లలిత్ కుమార్ అనుమతితో, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సింగరేణి ప్లాంటేషన్ ప్రాంతంలో కాంటూర్ ట్రెంచ్ తవ్వకం పనులు ప్రారంభమయ్యాయి. డీజీఎం (ఫారెస్ట్రీ) భానోత్ కర్ణ ఆధ్వర్యంలో మొదలైన ఈ పనులు, గ్రామీణ పేదలకు 100 రోజుల ఉపాధి కల్పించి ఆదాయాన్ని పెంచనున్నాయి. ఇటువంటి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా చేపట్టడం ద్వారా ప్రజలకు ఉపాధితో పాటు ఆర్థిక భద్రత కలుగుతుందని భానోత్ కర్ణ తెలిపారు.

## మహనీయులు జయంతి కార్యక్రమంలను విజయవంతం చేయండి



**ఉప్పల్, ఏప్రిల్ 9 పెన్ పవర్:** ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11, 14 తేదీలలో జరగనున్న మహనీయుల జయంతి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి. మహనీయుల ఆలోచనా విధానాన్ని కొనసాగించాలని, జయంతి కార్యక్రమాన్ని విద్యార్థి సంఘాలు, మేధావులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
‘పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మారుతున్న కాలంలో బంధాలు ప్రశ్నార్థకం!

**హైదరాబాద్ పెన్ పవర్:** మానవ సంబంధాల పరిధిలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత సహజమైన, నిస్వార్థమైన మరియు సుదీర్ఘకాలం పాటు కొనసాగే బంధం తోబుట్టువులదే. రక్త సంబంధీకుల మధ్య ఉండే ఈ అనుబంధం కేవలం ఒకే గర్భాన జన్మించడానికో, ఒకే ఇంట్లో పెరగడానికో పరిమితం కాదు; ఇది జీవితాంతం తోడుండే ఒక అదృశ్య శక్తి. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 10వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ‘అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవం’ ఈ పవిత్ర బంధానికి దక్కిన ఒక గొప్ప గుర్తింపు. కుటుంబ వ్యవస్థలో తోబుట్టువుల ప్రాముఖ్యతను చాటిచెప్పడమే కాకుండా, ఆధునిక యాంత్రిక జీవనంలో మరుగున పడుతున్న అనురాగాలను పునరుద్ధరించుకోవడానికి ఈ రోజు ఒక వేదికగా నిలుస్తోంది. ఈ దినోత్సవ ఆవిర్భావం వెనుక ఒక హృదయ విదారకమైన నేపథ్యం ఉంది. అమెరికాకు చెందిన క్లాడియా ఎవార్ట్ అనే మహిళ, తన చిన్నతనంలోనే సోదరి లిసెట్, సోదరుడు అలాన్‌లను ప్రమాదాల్లో కోల్పోయింది. వారి జ్ఞాపకాలను సజీవంగా ఉంచుకోవాలని, తోబుట్టువుల విలువను ప్రపంచానికి చాటాలని ఆమె సంకల్పించింది. ఈ క్రమంలో 1995లో ‘సిబ్లింగ్స్ డే ఫౌండేషన్’ను స్థాపించి, తన సోదరి పుట్టినరోజైన ఏప్రిల్ 10ని ‘తోబుట్టువుల దినోత్సవం’గా ప్రకటించాలని ఉద్యమించింది. ఇది అమెరికాలోని 49 రాష్ట్రాల గుర్తింపు పొందడమే కాకుండా, క్రమంగా ఐరోపా, ఆసియా ఖండాలకు విస్తరించింది. భారత దేశంలో రాఖీ పౌర్ణమి వంటి సంప్రదాయ పండుగలు ఉన్నప్పటికీ, పాశ్చాత్య దేశాల నుంచి వచ్చిన ఈ దినోత్సవం నేడు ప్రపంచ వ్యాప్త గుర్తింపు పొందింది. భారతీయ సంస్కృతిలో తోబుట్టువుల అనుబంధం అనేది వేల ఏళ్ల నాటి ఇతిహాసాల నుంచే ప్రతిబింబిస్తోంది. రామాయణంలో రాముడి పట్ల లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల భక్తి, త్యాగం ఆదర్శవంతమైనవి. సోదరుని కోసం రాజ్యాన్ని త్యజించిన భరతుడు, అడవులకు అనుసరించిన లక్ష్మణుడు తోబుట్టువుల బంధానికి పరాకాష్ట. అలాగే మహాభారతంలో పాండవుల ఐక్యతే వారి విజయానికి మూలస్తంభం. కృష్ణుడు–సుభద్ర, యమధర్మరాజు–యమునల మధ్య ఉండే అనురాగం మన సంస్కృతిలో భాగమైంది. రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్), భాయ్ దూజ్ వంటి పండుగలు సోదర–సోదరీమణుల మధ్య రక్షణను, ప్రేమను పెంపొందిస్తుండగా, ఏప్రిల్ 10న జరుపుకునే ఈ ఆధునిక దినోత్సవం ఆ బంధాన్ని మరింత విశ్వవ్యాప్తం చేస్తోంది. మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల విశ్లేషణ ప్రకారం, తోబుట్టువుల మధ్య ఉండే సంబంధం ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వ నిర్మాణంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. ఒకే వయసు సమూహంలో పెరగడం వల్ల పిల్లల్లో పంచుకునే గుణం, సహకారం, మరియు ఆరోగ్యకరమైన పోటీతత్వం అలవడతాయి. అమెరికాలోని ‘పిట్స్ బర్గ్ యూనివర్సిటీ’ పరిశోధనల ప్రకారం, తోబుట్టువులతో సత్సంబంధాలు ఉన్న వ్యక్తులు సమాజంలో ఇతరులతో సులభంగా కలిసిపోగలరని, వారిలో సామాజిక నైపుణ్యాలు 30 శాతం ఎక్కువగా ఉంటాయని తేలింది. ముఖ్యంగా, కష్టకాలంలో తోబుట్టువుల మద్దతు ఉన్నవారు మానసిక ఒత్తిడిని, కుంగుబాటును సమర్థవంతంగా ఎదుర్కోగలరని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ‘జర్నల్ ఆఫ్ ఫ్యామిలీ సైకాలజీ’ ప్రచురించిన అధ్యయనం ప్రకారం, తోబుట్టువుల మధ్య ఉండే ప్రేమ పూర్వక సంభాషణలు కౌమారదశలో ఉన్న పిల్లల్లో సామాజిక ప్రవర్తనను మెరుగు పరుస్తాయి. ఆధునిక సమాజంలో ఉమ్మడి కుటుంబాలు అంతరించి, వెస్టి కుటుంబాలు రాజ్యమేలుతున్నాయి. ఆర్థిక అవసరాల కోసం తోబుట్టువులు వేర్వేరు నగరాలు, దేశాలకు వలస వెళ్తున్నారు. దీనివల్ల భౌతిక దూరం పెరిగి, భావోద్వేగ బంధాలు బలహీనపడే ప్రమాదం ఉంది. ఇలాంటి తరుణంలో సిబ్లింగ్స్ డే వంటి దినోత్సవాలు టెక్నాలజీ సాయంతో బంధాలను పునరుద్ధరించుకోవడానికి దోహదపడుతున్నాయి. సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లలో పాత ఫోటోలను పంచుకోవడం, వీడియో కాల్స్ ద్వారా పలకరించుకోవడం వంటివి కేవలం సరదా కోసం చేసే పనులు కావు; అవి అంతర్గతంగా బంధాన్ని బలపరుస్తాయి. ఒక వ్యక్తి వృద్ధాప్యంలోకి అడుగు పెట్టినప్పుడు, తల్లిదండ్రుల మరణానంతరం మిగిలే ఏకైక రక్తసంబంధం తోబుట్టువులదే. వృద్ధులపై జరిపిన అధ్యయనాల ప్రకారం, తోబుట్టువులతో సఖ్యతగా ఉండేవారు 70 ఏళ్ల వయసులో కూడా తక్కువ ఒంటరితనానికి గురవుతారని, వారి జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయని నిరూపితమైంది. ప్రస్తుత కాలంలో పిల్లల సంఖ్య తగ్గడం వల్ల ‘ఏకైక సంతానం’ సంస్కృతి పెరుగుతోంది. తోబుట్టువులు లేని పిల్లలు సామాజికంగా ఒంటరితనాన్ని అనుభవించకుండా ఉండాలంటే, దాయాదులతో బంధాన్ని పెంపొందించడం అవసరం. తోబుట్టువుల బంధం అనేది కేవలం ఆటపాటలకే పరిమితం కాకుండా, ఒకరికొకరు ఆర్థికంగా, మానసికంగా వెన్నెముకలా నిలవాలి. ఆస్తి తగాదాలు, ఈగో సమస్యలు ఈ పవిత్ర బంధాన్ని కలుషితం చేయకుండా జాగ్రత్త పడాలి. చిన్ననాటి గొడవలు, చిలిపి చేష్టలు జీవితాంతం గుర్తుంచుకోదగ్గ తీపి జ్ఞాపకాలు. ఆ జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, ఒకరి ఎదుగుదలలో మరొకరు భాగస్వాములు కావడమే ఈ దినోత్సవం యొక్క అసలైన పరమార్థం. ముగింపుగా, తోబుట్టువుల బంధం అనేది దేవుడు ఇచ్చిన ఒక గొప్ప వరం. అది ప్రతిఫలం ఆశించని ప్రేమకు నిలయం. ఏప్రిల్ 10 కేవలం ఒక క్యాలెండర్ తేదీ కాదు; అది మన మూలాలను, మనతో కలిసి నడిచిన తోడూ–నీడను స్మరించుకునే శుభసమయం. మారుతున్న కాలంతో పాటు ఎన్ని మార్పులు వచ్చినా, తోబుట్టువుల మధ్య ఉండే అనురాగం నిత్య నూతనంగా వర్ధిల్లాలి. రక్త సంబంధాల విలువను కాపాడుకుంటూ, భావి తరాలకు ఆదర్శంగా నిలవడమే మనం ఈ సమాజానికి అందించే గొప్ప సందేశం. కుటుంబం ఒక నందనవనం కావాలంటే, అందులోని తోబుట్టువుల బంధం ఒక వికసించిన సుమమై సుగంధాలను వెదజల్లాలి.

## పత్రికా ప్రపంచపు దిగ్గజం

**హైదరాబాద్ పెన్ పవర్:** భారతీయ పత్రికా రంగ చరిత్రలో చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి ఒక ధ్రువతార. తెలుగు నేల మీద జన్మించి, ఉత్తర భారతదేశ పత్రికా ప్రపంచాన్ని తన కలంతో శాసించిన ఈ అసాధారణ మేధావి జీవితం ఒక విజ్ఞాన సర్వస్వం. 1880 ఏప్రిల్ 10వ తేదీన విజయనగరంలోని ఒక సాంప్రదాయ వేద పండిత కుటుంబంలో చింతామణి జన్మించారు. ఆయన తండ్రి చిర్రావూరు రామసోమయాజులు విజయనగర సంస్థానాధీశులైన మహారాజా విజయరామ గజపతిరాజుకు రాజగురువుగా ఉండేవారు. వంశపారంపర్యంగా వస్తున్న పౌరోహిత్యాన్ని పుణికిపుచ్చుకుంటారని అందరూ భావించినా, చింతామణి మార్గం మాత్రం భిన్నంగా సాగింది. పది ఏళ్ల ప్రాయంలోనే వివాహం జరగడం, అనారోగ్య సమస్యలు, మాతృవియోగం వంటి కఠిన పరిస్థితుల వల్ల ఆయన ఎఫ్.ఏ పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేకపోయారు. అయితే, విశ్వ విద్యాలయాల నుండి పట్టాలు పొందలేక పోయినా, ఆయన తన స్వయంకృషితో సంపాదించిన ఆంగ్ల భాషా పాండిత్యం అమోఘమైనది. ఒక భాషపై పట్టు సాధించాలంటే కేవలం తరగతి గదులే మార్గం కాదని, నిరంతర పఠనం మరియు అకుంఠిత దీక్ష ఉంటే అసాధ్యమైనది ఏదీ లేదని ఆయన నిరూపించారు. విజయనగర మహారాజా కళాశాలలో చదువుకుంటున్న రోజుల్లోనే రాజకీయాల పట్ల, సామాజిక అంశాల పట్ల ఆయన ఆకర్షితులయ్యారు. విశాఖపట్నంలోని స్థానిక రాజకీయ నేతలతో తిరుగుతూ, పత్రికలకు వ్యాసాలు రాయడం ప్రారంభించారు. కేవలం పద్దెనిమిదేళ్ల ప్రాయంలోనే ‘వైజాగ్ స్పెక్టేటర్’ అనే పత్రికకు సంపాదకత్వం వహించే అరుదైన అవకాశం ఆయనను వెతుక్కుంటూ వచ్చింది. ఆ రోజుల్లో నెలకు కేవలం ముప్పై రూపాయల వేతనంతో ప్రారంభమైన ఆయన ప్రస్థానం, అనతి కాలంలోనే ఆయనను ఆ పత్రిక యజమానిగా మార్చింది. మూడు వందల రూపాయలకు ఆ పత్రికను కొనుగోలు చేసి, దానిని విజయనగరానికి తరలించి ‘ఇండియన్ హెరాల్డ్’గా నామకరణం చేశారు. ఆ పత్రికా నిర్వహణలో చింతామణి ఒక సాహసిగా నిలిచారు. ఆయనే సంపాదకుడు, ఆయనే రిపోర్టర్, ఆయనే ప్రూఫ్ రీడర్, ఆయనే ఫోర్మెన్. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టినా వెనకడుగు వేయకుండా పత్రికను నడిపించిన తీరు ఆయనలోని పట్టుదలకు నిదర్శనం. చివరికి పత్రికను మూసివేయవలసి వచ్చినా, ఆయనలోని జర్నలిస్టు సజీవంగానే ఉన్నాడు. ఆ తర్వాత మద్రాసు వెళ్ళి ‘యునైటెడ్ ఇండియా’ మరియు ‘మద్రాస్ స్టాండర్డ్’ వంటి పత్రికల్లో పనిచేస్తూ తన అనుభవాన్ని మరింత మెరుగు పరుచుకున్నారు.

1903లో చింతామణి జీవితంలో ఒక కీలక మలుపు సంభవించింది. నాగేంద్రనాథ్ గుప్తా ఆహ్వానం మేరకు ఆయన అలహాబాదుకు తరలివెళ్లారు. అక్కడ ‘ఇండియన్ పీపుల్’ పత్రికా బాధ్యతలు స్వీకరించారు. 1909లో మదన్ మోహన్ మాలవ్యా, తేజ్ బహద్దర్ సప్రూ వంటి దిగ్గజాలు ‘లీడర్’ పత్రికను ప్రారంభించినప్పుడు, ‘ఇండియన్ పీపుల్’ దానిలో విలీనమైంది. చింతామణి ‘లీడర్’ పత్రికకు సంపాదకుడయ్యారు. దాదాపు ముప్పై ఏళ్ల పాటు ఆ పత్రిక ద్వారా ఆయన భారత జాతీయ వాదాన్ని, సామాజిక సంస్కరణలను బలంగా వినిపించారు. ఆయన రాసే సంపాదకీయాలు బ్రిటిష్ అధికారులను సైతం ఆలోచింపజేసేవి. నిష్పక్షపాతమైన విమర్శ, తర్కబద్ధమైన విశ్లేషణ ఆయన శైలి. అందుకే ఆయనను సమకాలీన జర్నలిజం లోకం ‘పోప్ ఆఫ్ ఇండియన్ జర్నలిజం’ అని గౌరవంగా పిలుచుకుంది. ఒక తెలుగు వ్యక్తి హిందీ హృదయభూమిలో ఆంగ్ల పత్రికా రంగానికి దిక్సూచిగా మారడం తెలుగు వారందరికీ గర్వకారణం. రాజకీయ రంగంలో కూడా చింతామణి తనదైన ముద్ర వేశారు. కేవలం ఇరవై ఏళ్ల వయసులో లాహోర్ కాంగ్రెస్ మహాసభలకు వెళ్ళడానికి ప్రయాణ ఖర్చులు లేక అప్పు చేసి మరీ వెళ్లిన ఆయన నిబద్ధత సామాన్యమైనది కాదు. అక్కడ ఆయన చేసిన ప్రసంగాలు సురేంద్రనాథ్ బెనర్జీ వంటి మహామహులను ఆశ్చర్య పరిచాయి. ‘హిందూ’ పత్రిక సైతం ఆయన వాగ్ధాటిని కొనియాడింది. రాజకీయాల్లో ఆయన ఉదారవాద (ఒతిఎవతీజీశ్రీ) పంథాను అనుసరించారు. కాంగ్రెస్ నాయకులతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ, గాంధీజీ చేపట్టిన సహాయ నిరాకరణ మరియు శాసనోల్లంఘన ఉద్యమాల్లోని కొన్ని పద్ధతులతో ఆయన విభేదించారు. అయినా, గాంధీజీ మరియు నెహ్రూ వంటి నాయకులకు చింతామణి అంటే ఎనలేని గౌరవం ఉండేది. 1921 నుండి 1923 వరకు అప్పటి యునైటెడ్ ప్రావిన్సెస్ (నేటి ఉత్తర ప్రదేశ్) రాష్ట్రంలో విద్య మరియు పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ పదవిలో ఉండి విద్యారంగంలో ఆయన తీసుకొచ్చిన సంస్కరణలు చిరస్మరణీయమైనవి. లండన్లో జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రతినిధిగా పాల్గొని భారతీయ ఆకాంక్షలను వినిపించారు. చింతామణి ప్రతిభకు గుర్తింపుగా బ్రిటిష్ ప్రభుత్వం 1939లో ఆయనకు ‘సర్’ బిరుదును ప్రదానం చేసింది. అలాగే బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం ఎల్.ఎల్.డి మరియు అలహాబాద్ విశ్వవిద్యాలయం డి.లిట్ వంటి గౌరవ పట్టాలతో ఆయనను సత్కరించాయి. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక వ్యవస్థ. తెలుగు తేజాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లిన ఆయన, చివరి శ్వాస వరకు తన వృత్తి పట్ల నిబద్ధతతోనే ఉన్నారు. 1941 జూలై 1న మరణించే సమయానికి ఆయన వయసు 62 ఏళ్లు. చిత్రమేమిటంటే, ఆయన మరణించిన రోజు కూడా పత్రిక కోసం సంపాదకీయం రాశారు. ఆ సంపాదకీయం ఎంతో స్పష్టంగా,

విశ్లేషణాత్మకంగా, ఎటువంటి లోపాలు లేకుండా ఉంది. క్రమ పద్ధతిలో భాషా పటిమను ప్రదర్శిస్తూ, ఎక్కడా అనవసరపు విరామాలు లేకుండా ఆయన అందించిన ఆ చివరి వ్యాసం ఆయన వృత్తి పట్ల ఉన్న అంకితభావానికి మకుటం. విజయనగరం మట్టిలో పుట్టి, అలహాబాదు గాలిలో తన కీర్తిని పదిలపరుచుకున్న సర్ వై. చింతామణి జీవితం, ముఖ్యంగా నేటి తరం యువతకు మరియు జర్నలిస్టులకు ఒక గొప్ప పాఠ్యగ్రంథం. విశ్వవిద్యాలయ డిగ్రీలు లేకపోయినా విజ్ఞాన శిఖరాలను అధిరోహించవచ్చని, పుట్టిన గడ్డను వదిలి వెళ్లినా మాతృభూమి గౌరవాన్ని పెంచవచ్చని ఆయన నిరూపించారు. తెలుగు జాతి గర్వించదగ్గ అరుదైన ప్రతిభాశాలి చింతామణి.

# అమరావతిలో మినీ ఢిల్లీ

**విజయవాడ, ఏప్రిల్ 9, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. దీని కోసం రూపొందించిన సమగ్ర ప్రాజెక్టు నివేది తుది దశకు చేరుకుంది. ఢిల్లీలోని సెంట్రల్ వెస్టా తరహాలో, సుమారు 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఈ అత్యాధునిక సచివాలయ సముదాయాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న సుమారు 50కి పైగా కేంద్ర ప్రభుత్వ విభాగాలు, అనుబంధ సంస్థలు ఈ నూతన భవనంలోకి మారనున్నాయి. ఈ ప్రాజెక్టును కేవలం కార్యాలయ భవనంగానే కాకుండా, పర్యావరణ హితమైన గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఐకానిక్ డిజైన్‌తో కూడిన ఈ భవన సముదాయంలో సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్, అత్యాధునిక ఐటీ మౌలిక సదుపాయాలు, కాన్ఫరెన్స్ హాల్స్ , విశాలమైన పార్కింగ్ సౌకర్యాలు ఉండనున్నాయి. సుమారు 10 నుంచి 12 అంతస్తుల ఎత్తుతో నిర్మించనున్న ఈ భవనం, అమరావతి నగరానికే ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీని ద్వారా పాలనలో వేగం పెరగడంతో పాటు, ప్రజలకు అన్ని కేంద్ర సేవలు ఒకే చోట లభించే వెసులుబాటు కలుగుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను కేంద్ర ప్రజా పనుల శాఖ పర్యవేక్షించనుంది. ప్రాథమిక అంచనాల ప్రకారం, ఈ సముదాయం నిర్మాణానికి సుమారు రూ. మూడు వేల కోట్ల వరకు వ్యయం కావచ్చని భావిస్తున్నారు. రాజధాని ప్రాంతంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన భూములను దీని కోసం



వినియోగించుకోనున్నారు. కేంద్ర కేబినెట్ నుంచి తుది ఆమోదం లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియను ప్రారంభించి, రాబోయే రెండేళ్లలోపు నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేంద్ర సచివాలయ నిర్మాణం వల్ల అమరావతి ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత పుంజుకోనున్నాయి. వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఒకే ప్రాంతానికి రావడం వల్ల స్థిరాస్తి రంగానికి ఊతం లభించడమే కాకుండా, స్థానికంగా సేవా రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అమరావతిని కేవలం ఒక పరిపాలనా కేంద్రంగానే కాకుండా, జాతీయ స్థాయిలో ఒక కీలకమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలవనుంది.

**ప్రాజెక్టు అంచనా వ్యయం:**
సెంట్రల్ సెక్రటేరియట్: రూ. 1,299.08 కోట్లు.
ఉద్యోగుల నివాస సముదాయాలు: రూ. 1,234.91 కోట్లు.

**నిర్మాణ విస్తీర్ణం:**
ఈ భారీ ప్రాజెక్టు కోసం ఏపీ సీఆర్‌డీఏ ఇప్పటికే 22.53 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో 5.53 ఎకరాల్లో సచివాలయ భవనం, మిగిలిన 17 ఎకరాల్లో కేంద్ర ఉద్యోగుల కోసం బహుళ అంతస్తుల నివాస భవనాలను నిర్మించనున్నారు. కేంద్ర గృహ నిర్మాణ శాఖ పంపిన ఈ ప్రతిపాదనలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే ఆమోదం తెలిపారు.

**ప్రముఖుల చొరవ:**
ఈ ప్రాజెక్టు త్వరగా పట్టాలెక్కేలా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నిరంతరం అధికారులతో సంప్రదింపులు జరుపుతూ పర్యవేక్షించారు. మరోవైపు, ఇదే ప్రాంతంలో మరో 10 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తామని హుడ్‌కోవెల్లడించింది. దీనివల్ల అమరావతిలో జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణకు మార్గం సుగమం కానుంది.

# మామిడి రైతులపై యుద్ధ ప్రభావం



**విజయవాడ, ఏప్రిల్ 9, పెన్ పవర్:** భారత్‌లో మామిడి సీజన్ ప్రారంభమైందంటే ఎగుమతిదారులలో ఎంతో ఉత్సాహం కనిపిస్తుంది. కానీ, 2026 ఏప్రిల్ నెలలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పశ్చిమాసియాలో ముఖ్యంగా ఇరాన్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా భారతీయ మామిడి ఎగుమతులు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మేలైన రకాలపై ఆల్ఫాన్సో, కేసర్, మన తెలుగు రాష్ట్రాల్లోప్రసిద్ధి చెందిన బంగినపల్లి వంటి రకాల ఎగుమతులకు ఈ యుద్ధం పెద్ద అడ్డంకిగా మారింది. రెండు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించింది. దీనికి తోడు ఎర్ర సముద్రంలో నెలకొన్న అలజడుల వల్ల ప్రధాన షిప్పింగ్ లైన్లు తమ నౌకలను కేప్ ఆఫ్ గుడ్ హోప్ మీదుగా మళ్లించాల్సి వస్తోంది. ఈ మార్పు వల్ల ప్రయాణం కాలం విపరీతంగా పెరగడమే కాకుండా ఓడరేవుల్లో రద్దీ పెరిగి కంటైనర్లు సకాలంలో తిరిగి రావడం లేదు. మామిడి వంటి త్వరగా పాడైపోయే పండ్ల రవాణాకు రీఫర్ అని పిలిచే రిఫ్రిజిరేటెడ్ కంటైనర్లు అత్యవసరం. ఈ కంటైనర్లలో ఉష్ణోగ్రతను కచ్చితంగా 11 నుంచి 18 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంచాలి. భారత్ సొంతంగా ఈ రీఫర్ కంటైనర్లను తయారుచేయదు. మనం పూర్తిగా అంతర్జాతీయ షిప్పింగ్ లైన్లపైనే ఆధాపడుతున్నాం. యుద్ధం కారణంగా ఈ కంటైనర్ల రాకపోకలు మందగించడంతో ప్రస్తుతం మార్కెట్‌లో వీటి కొరత తీవ్రంగా ఉంది. యుద్ధం కారణంగా రవాణా రంగంపై పడిన ఆర్థిక భారం సామాన్యులను దిగ్భ్రాంతికి గురి చేస్తోంది. గల్ఫ్ దేశాలకు వెళ్లే సముద్ర రవాణా ఛార్జీలు కొన్ని మార్గాల్లో ఏకంగా 8 రెట్లు పెరిగాయి. యుద్ధం ఉన్న ప్రాంతాల గుండా ప్రయాణించే నౌకలపై బీమా ఛార్జీలు, అదనపు పన్నులు భారీగా పెరిగాయి. కేవలం మార్చి నెలలోనే రీఫర్ కంటైనర్ల ఛార్జీలు వెయ్యి డాలర్లు వరకు పెరిగాయి. కొన్ని మార్గాల్లో సుమారు నాలుగువేల డాలర్ల వరకు అదనపు పన్నులు విధిస్తున్నారు. ఇది సాధారణ రవాణా ఖర్చు కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. ప్రపంచ మామిడి ఉత్పత్తిలో భారత్ అగ్రమగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పండే మామిడిలో 44 శాతం అంటే సుమారు 20.68 మిలియన్ టన్నులు భారత్ నుంచే వస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ 56.5 మిలియన్ డాలర్ల విలువైన 29,938 టన్నుల తాజా మామిడి ఎగుమతి చేసింది. మన ఎగుమతుల్లో 40 శాతం నుంచి 45 శాతం వాటా గల్ఫ్ దేశాలదే. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉండే పీక్ సీజన్‌లో ఎగుమతిదారులకు ఇప్పటికే భారీ ఆర్డర్లు ఉన్నాయి. మామిడి పండు కోసిన తర్వాత కేవలం 28 రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది. సముద్ర మార్గంలో ప్రయాణ కాలం పెరగడం వల్ల పండ్లు గమ్యస్థానానికి చేరే లోపే పాడైపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల ఎగుమతిదారులు విమాన రవాణాను ఎంచుకోవాల్సి వస్తోంది. సముద్ర రవాణా ఖర్చు కేజీకి 50 నుంచి 80 రూపాయలు. విమాన రవాణా ఖర్చు కేజీకి 240 రూపాయల నుంచి 300 రూపాయలు. విమాన రవాణా దాదాపు ఐదు నుంచి ఆరు రెట్లు ఖరీదైనదిగా కావడంతో ఎగుమతిదారుల లాభాలు తగ్గిపోతున్నాయ. ఈ సంక్షోభం కేవలం ఎగుమతిదారులకే పరిమితం కాలేదు. మహారాష్ట్ర ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని రైతులకు కూడా ఇది పెద్ద దెబ్బ. ఎగుమతులు నిలిచిపోతే, ఆ నిల్వలన్నీ స్థానిక మార్కెట్‌కు మళ్లుతాయి. దీని వల్ల దేశీయంగా మామిడి ధరలు భారీగా పడిపోయి రైతులకు కనీస పెట్టబడి పోటీని ఎదుర్కోవడంలో కూడా భారత్ వెనుకబడే అవకాశం ఉంది. ఈ సమస్య కేవలం మామిడికే పరిమితం కాలేదు. అరటి, ద్రాక్ష, ఉల్లిపాయలు, సీ ఫుడ్ వంటి త్వరగా పాడైపోయే వస్తువులపై కూడా ఈ ప్రభావం పడింది. ముంబైలోని జీఎస్పీటీ ఓడరేవులో వందలాది కంటైనర్లు నిలిచిపోయాయి.

# పవర్ ఫుల్ ఉమెన్ నుంచి జైలు గోడలవరకు... కళింగిరి శాంతి ప్రస్థానం

**కాకినాడ, ఏప్రిల్ 9, పెన్ పవర్:** దేవాదాయ శాఖలో అత్యంత వివాదాస్పద అధికారిగా పేరుపొందిన అసిస్టెంట్ కమిషనర్ కళింగరి శాంతి ఉదంతం, అధికార బలం ఉంటే వ్యవస్థలను ఎలా శాసించవచ్చో చెప్పడానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. కేవలం ఆరేళ్ల సర్వీసులో, అందులోనూ రెండేళ్ల సస్పెన్షన్ కాలం పోను, కేవలం నాలుగేళ్లలోనే ఆమె సృష్టించిన ప్రకంపనలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా ఏసీబీ దాడుల్లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయ్యి, 14 రోజుల రిమాండ్‌కు వెళ్లడంతో ఆమె అప్రతిహత ప్రస్థానానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. 2020లో దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరిన కళింగరి శాంతికి, అప్పటి అధికార పార్టీలో కీలక నేతగా ఉన్న విజయసాయి రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ రాజకీయ అండతో ఆమె అటు ఉద్యోగ పరంగా, ఇటు వ్యక్తిగత జీవితంలోనూ తీవ్ర వివాదాలకు కేంద్రబిందువైంది. భర్త మదన్ మోహన్‌తో విడాకులు తీసుకోకుండానే మరొకరితో సహజీవనం చేయడం, ఒక బిడ్డకు జన్మనివ్వడం వంటి అంశాలు అప్పట్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఆ బిడ్డ తండ్రి ఎవరనే విషయంలో భర్త మదన్ మోహన్ చేసిన ఆరోపణలు, విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్షలు చేయాలన్న డిమాండ్లు అప్పట్లో సంచలనం సృష్టించాయి. శాంతి అధికార దర్పం ఏ స్థాయిలో ఉండేదంటే, విశాఖపట్నంలో పనిచేస్తున్న సమయంలో తన పై అధికారి అయిన డెప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ గదిలోకి చొరబడి ఆయనపై ఇసుక చల్లడం ఆమె బరితెగింపునకు పరాకాష్ట. ఒక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఆమె ఈ చర్యకు పాల్పడటం గమనార్హం. ఈ ఘటన సీసీటీవీలో రికార్డ్ అయినప్పటికీ, విచారణాధికారి తప్పు పట్టినప్పటికీ, ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోకుండా, ఫిర్యాదు చేసిన పై అధికారిని బదిలీ చేయడం వ్యవస్థల నిర్వీర్యానికి నిదర్శనం. దీంతో మనస్తాపం చెందిన డెప్యూటీ కమిషనర్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. విశాఖలో పని చేస్తున్న సమయంలో 'ప్రేమ సమాజం' భూములు, ఇతర దేవాదాయ భూముల లీజుల వ్యవహారంలో ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెను సస్పెండ్ చేసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఆమెను డిస్మిస్ చేసే ఫైల్ ముందుకు కదలలేదనే విమర్శలు ఉన్నాయి. కోర్టు ఆదేశాలతో మార్చి చివరి వారంలో తిరిగి పోస్టింగ్ పొందిన శాంతి, పది రోజులు గడవకముందే ఏసీబీ వలలో చిక్కుకుంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అభియోగంపై ఏసీబీ ఆమెను అరెస్ట్ చేసి జైలుకు పంపింది. శాంతి ఉదంతం రెండు ముఖ్యమైన పాఠాలను నేర్పుతుంది. రాజకీయ నాయకుల మద్దతు ఉంటే చట్టాన్ని, నిబంధనలను అతిక్రమించవచ్చనే ధీమా అధికారులను ఎంతటి పతనానికి తీసుకెళ్తుందో శాంతి జీవితం ఒక హెచ్చరిక. ఒక జూనియర్ అధికారి ఇంతగా రెచ్చిపోతున్నా.. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆమె విషయంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. కోర్టు ఆదేశాలు ఇచ్చే వరకు లేదా ఏసీబీ దాడులు జరిగే వరకు వేచి చూడటం వ్యవస్థల బలహీనతను సూచిస్తుంది. మొత్తానికి, దేవాదాయ శాఖలో పవర్ ఫుల్ వుమెన్ గా చలామణీ అయిన కళింగరి శాంతి ప్రస్థానం ప్రస్తుతం జైలు ఊచల వెనక్కి చేరింది. అధికార గర్వం, అవినీతి వెరసి ఒక అధికారి జీవితాన్ని ఎలా అగాధంలోకి నెట్టేస్తాయో చెప్పడానికి ఈ స్టోరీ ఒక సాక్ష్యం.

## వైసీపీకి ముందున్న సవాళ్లు..వ్యూహాలే కీలకం..




**ఒంగోలు, ఏప్రిల్ 9,పెన్ పవర్:** గత ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంటుస్థానం నుంచి పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఓటమి పాలవడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. ఆయనకు ఆ ప్రాంతంతో ప్రత్యక్ష అనుబంధం లేకపోయినా, పార్టీ నిర్ణయాన్ని గౌరవిస్తూ పోటీకి దిగారు. చిత్తూరు జిల్లా ముఖ్యంగా చంద్రగిరి నియోజకవర్గం నుంచి వచ్చిన ఆయనను ఒంగోలు ప్రజలు పూర్తిగా అంగీకరించలేకపోయారని విశ్లేషణలు సూచిస్తున్నాయి. స్థానికంగా బలమైన ఓటు బ్యాంక్ ఉన్నప్పటికీ, అది విజయం సాధించేందుకు సరిపోలేదు. ఇదే సమయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి మారిన మాగుంట శ్రీనివాసులు రెడ్డి విజయం సాధించడం కీలక అంశంగా మారింది. ఆయనకు స్థానిక పరిచయం, ప్రజలతో అనుబంధం ఉండటం కూడా విజయానికి కారణమయ్యాయి. ఎన్నికల్లో కేవలం సామాజిక వర్గాల లెక్కలు సరిపోవు, ప్రజల మనస్తత్వం కూడా అర్థం చేసుకోవాలి అన్న విషయం ఇక్కడ స్పష్టమైంది. ఇలాంటి పరిస్థితులు మరికొన్ని చోట్ల కూడా కనిపించాయి. నెల్లూరు సిటీ నుంచి గుంటూరు జిల్లా నరసరావుపేట కు అనిల్ కుమార్ ను పంపించడం కూడా అప్పట్లో చర్చనీయాంశమైంది. స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకోకుండా తీసుకున్న ఈ తరహా నిర్ణయాలు పార్టీకి ప్రతికూలంగా మారాయని కొందరు భావిస్తున్నారు. నాయకుల వ్యక్తిగత ఇమేజ్‌పై మాత్రమే ఆధారపడటం సరిపోదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## కులరాజకీయాలు....పెరుగుతున్న ఒత్తిడి

**నెల్లూరు, ఏప్రిల్ 9, పెన్ పవర్:** రాష్ట్ర రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం రోజు రోజుకు పెరుగుతోంది. ఒకప్పుడు పార్టీల అంతర్గత వ్యవహారాలుగా ఉన్న కుల ఆధారిత నిర్ణయాలు ఇప్పుడు బహిరంగ చర్చలకు వస్తున్నాయి. ప్రజలు కూడా తమ వర్గాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారు, ఏ మేరకు అవకాశాలు కల్పిస్తున్నారు అనే విషయాలను నేరుగా ప్రశ్నించే స్థాయికి వచ్చారు. ఇది రాజకీయ వ్యవస్థలో ఒక పెద్ద మార్పుగా భావించవచ్చు. ఇప్పటి వరకు రాజకీయ పార్టీలు టికెట్ల కేటాయింపులో సామాజిక సమీకరణాలను పరిగణలోకి తీసుకున్నప్పటికీ, అది ఎక్కువగా పార్టీ లోపలే పరిమితమయ్యేది. సమాజంలో ఉన్న పరిస్థితులను బట్టి కొన్ని వర్గాలకు ఎక్కువ అవకాశాలు, మరికొన్ని వర్గాలకు తక్కువ ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతూ వచ్చేది. అయితే, ఈ అసమానతలను చాలా వర్గాలు సహజంగా అంగీకరించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బోయ సమాజం పెద్ద సంఖ్యలో ఉంది. ఈ వర్గం చాలా కాలంగా ఎస్టీ హోదా కోసం డిమాండ్ చేస్తోంది. అదే విధంగా చిత్తూరు జిల్లాలో రెల్లి సమాజం గణనీయంగా ఉంది. వీరు వ్యవసాయం, సంప్రదాయ వృత్తులతో జీవనం సాగిస్తూ ఉన్నప్పటికీ, రాజకీయంగా తగిన గుర్తింపు లేదని భావిస్తున్నారు. ఇక ఉమ్మడి కృష్ణా జిల్లా లో వైశ్య వర్గం కూడా ఇప్పుడు రాజకీయంగా చైతన్యం పొందుతోంది. తమకు తగిన ప్రాతినిధ్యం లేదని భావిస్తూ వారు కూడా తమ డిమాండ్లను బలంగా వినిపిస్తున్నారు. తూర్పు గోదావరి,పశ్చిమ గోదావరి జిల్లాల్లో కేవలం కాపు వర్గం మాత్రమే కాకుండా, ఇతర సామాజిక వర్గాలు కూడా గణనీయంగా ఉన్నాయనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఇలా ప్రతి జిల్లాలోనూ కొన్ని వర్గాలు తమకు సరైన అవకాశాలు లభించడం లేదని భావిస్తున్నాయి. ఇప్పటి వరకు నియోజకవర్గాల సంఖ్య పరిమితంగా ఉండటం, పోటీ తీవ్రంగా ఉండటంతో ఈ అసంతృప్తి అంతగా బయటకు రాలేదు. కానీ పరిస్థితులు మారుతున్నాయి. త్వరలో జరిగే నియోజకవర్గాల పునర్విభజన కారణంగా సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రతి వర్గం తమకు ఎక్కువ ప్రాధాన్యం కావాలని కోరుతోంది. ముఖ్యంగా మండలాలు, పట్టణ స్థాయిలో నాయకత్వం వహిస్తున్న సామాజిక వర్గాల నేతలు ఈ డిమాండ్లను ముందుకు తెస్తున్నారు. ఇది క్రమంగా రాష్ట్ర స్థాయిలో పెద్ద చర్చగా మారుతోంది. అన్ని రాజకీయ పార్టీలపై ఈ ఒత్తిడి పెరుగుతోంది. ప్రతి వర్గాన్ని సంతృప్తి పరచాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఈ పరిస్థితుల్లో టికెట్ల కేటాయింపు ప్రక్రియ పార్టీలకు పెద్ద సవాల్‌గా మారే అవకాశం ఉంది. సమతుల్యత పాటించకపోతే అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. అందుకే ఈసారి ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక నిజంగా కత్తిమీద సాములా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కర్నూలులోనే మూడు ప్రధానా కార్యాలయాలు

**కర్నూలు, ఏప్రిల్ 9, పెన్ పవర్:** కర్నూలులోని రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్ అమరావతికి తరలించాలని దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. వక్ఫ్ ట్రైబ్యునల్‌ను అమరావతిలో కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కోర్టుకు లాయర్ తెలిపారు. మరోవైపు లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను కూడా కర్నూలులోనే కొనసాగిస్తామని ప్రభుత్వం తెలిపింది. 2021లో కార్యాలయాల తరలింపు పిల్‌లు దాఖలయ్యాయి. తాజాగా ప్రభుత్వ క్లారిటీ ఇవ్వడంతో ఈ మూడు ముఖ్యమైన కార్యాలయాలు కర్నూలులోనే కొనసాగనున్నాయి. కర్నూలులోనే వక్ఫ్ ట్రైబ్యునల్, లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ) కార్యాలయాలు కొనసాగుతాయని ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఏపీ హైకోర్టులో రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్ తరలింపుపై పిల్ దాఖలైంది.. కర్నూలలో ఉన్న వక్ఫ్ ట్రైబ్యునల్‌ను అమరావతికి తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని 2021లో సామాజిక కార్యకర్త మహ్మద్ ఫరూఖ్ షిబ్లి హైకోర్టును కోరారు. ట్రైబ్యునల్ మినహా వక్ఫ్‌బోర్డు, తదితర మైనారిటీ సంస్థలన్నీ విజయవాడలో ఉన్నాయని పిటిషనర్ తరఫు లాయర్ కోర్టులో వాదనలు వినిపించారుపరిపాలనా సౌలభ్యం కోసం ట్రైబ్యునల్‌ను అమరావతికి తరలించాలని పిటిషనర్ తరఫు లాయర్ కోరారు. వక్ఫ్ సంస్థలు, ఆస్తులు, వివాదాలకు సంబంధించిన ఎక్కువ కేసులు కర్నూలుతో పాటుగా చుట్టుపక్కల జిల్లాల్లో ఉన్నాయని ప్రభుత్వం తరఫున లాయర్ వాదించారు. హైకోర్టు కూడా వక్ఫ్ ట్రైబ్యునల్ కర్నూలులో ఉండటంలో న్యాయం ఉందని అభిప్రాయపడింది.. ఈ మేరకు షిబ్లీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం కొట్టేసింది. అంతేకాదు కర్నూలు నుంచి అమరావతికి హెచ్‌ఆర్సీ, లోకాయుక్తలను తరలించాలని 2021లో హైకోర్టులో పిల్‌లు దాఖలయ్యాయి. ఈ క్రమంలో తాజాగా కర్నూలులో ఉన్న మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ), లోకాయుక్త అంశంపై ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తరఫున లాయర్ కోర్టుకు తెలిపారు. మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ)లో ఏపీ, తెలంగాణ మధ్య సిబ్బంది విషయమై విభజన జరగాల్సి ఉందన్నారు. ఇటు లోకాయుక్తను కూడా త్వరలో నియమిస్తామని తెలిపారు. ప్రభుత్వ తరఫు లాయర్ కోర్టుకు తెలిపిన వివరాలను పరిగణనలోకి తీసుకుని విచారణను వాయిదా వేసింది. గత ప్రభుత్వ హయాంలో లోకాయుక్త, హెచ్‌ఆర్సీ కార్యాలయాలను కర్నూలుకు తరలించారు. అయితే ఈ రెండు కార్యాలయాలను అమరావతికి తరలించాలని హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యాలు దాఖలయ్యాయి.. వాటిపై హైకోర్టు విచారణ చేస్తోంది. అంతేకాదు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశం కూడా తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# అప్పటివరకు ఇరాన్ చుట్టూనే మా బలగాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించడం కోసం కాల్పుల విరమణ ఒప్పందం జరిగినా.. పలు ప్రాంతాల్లో దాడులు కొనసాగడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామాలపై తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక పోస్ట్ చేశారు. యుద్ధం ముగింపునకు సంబంధించి పూర్తిస్థాయి ఒప్పందం అమలయ్యేంత వరకు.. తమ దేశానికి చెందిన యుద్ధనౌకలు, బలగాలు ఇరాన్ చుట్టూనే ఉంటాయని ట్రంప్ స్పష్టం చేశారు. ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే పరిణామాలు మరింత తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. “యుద్ధం ముగించే విషయంలో ఇరాన్‌తో పూర్తిస్థాయి ఒప్పందం కుదిరి అది అమల్లోకి వచ్చేంత వరకు మా యుద్ధ నౌకలు, విమానాలు, సైనిక సిబ్బంది, ఆయుధాల వంటివన్నీ ఇరాన్, దాని పరిసర ప్రాంతాల్లోనే మోహరించి ఉంటాయి. ఏదైనా కారణంతో ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే గనుక.. మునుపెన్నడూ చూడనంత స్థాయిలో మేం విరుచుకుపడతాం. ఈలోగా.. అమెరికా సైన్యం విశ్రాంతి తీసుకుంటూ, తమ తదుపరి మిషన్ కోసం ఎదురుచూస్తూ ఉంటుంది.



ఇక, ఇరాన్ వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ అణ్వాయుధాలు ఉండకూడదు. హర్మూజ్ జలసంధిని తెరిచి, దాన్ని సురక్షితంగా ఉంచాల్సిందే” అని ట్రంప్ తన ట్రూత్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడుల నేపథ్యంలో హర్మూజ్‌ను మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం నుంచి వైదొలగుతామనీ హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే ట్రంప్ దీనిపై స్పందిస్తూ టెహ్రాన్‌కు మళ్లీ హెచ్చరికలు చేశారు. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి. అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్ భాగం కాదని పేర్కొంటూ ఇజ్రాయెల్ ఆ దేశంపై భీకర దాడులు చేసింది. ఇందులో వందల సంఖ్యలో పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై దాడులకు దిగింది.

## నేపాల్ మాజీ ప్రధాని బహదూర్ దేవుబా అరెస్ట్ వారెంట్



**హైదరాబాద్ పెన్ పవర్:** అవినీతి ఆరోపణలపై నేపాల్ మాజీ ప్రధాని బహదూర్ దేవుబాపై అరెస్ట్ వారెంట్ జారీ చేసినట్లు అధికారులు గురువారం తెలిపారు. మనీలాండరింగ్ విభాగం అభ్యర్థన మేరకు, దేవుబా భార్య, మాజీ విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవుబాపై కూడా అధికారులు వారెంట్ జారీ చేశారని ఖాట్మండుకోర్టు అధికారులు మీడియాకు వెల్లడించారు. దేవుబా, ఆయన భార్య సింగపూర్‌లో ఉండటంతో పోలీసులు ఇంటర్ పోల్ నోటీసులు జారీచేసేందుకు యత్నిస్తున్నారని తెలిపింది. తాను, తన భార్య ప్రస్తుతం దీర్ఘకాలిక వైద్య చికిత్స కోసం విదేశాల్లో ఉన్నామని దేవుబా పేర్కొన్నారు. ఇతర వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. గత నెలలో, సెప్టెంబర్‌లో జరిగిన అవినీతి వ్యతిరేక నిరసనలపై జరిగిన హింసాత్మక అణచివేతకు పాల్పడ్డారంటూ మరో మాజీ ప్రధాని కె.పి.శర్మ ఓలిని, మాజీ హోంమంత్రి రమేష్ లేఖక్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీకి చెందిన బాలేంద్ర షా ఇటీవల ప్రధానిగా ఎన్నికయ్యారు.

## ఇజ్రాయిల్ బరితెగింపు

**హైదరాబాద్ పెన్ పవర్:** అనుకున్నంతా జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం పరిధిలోకి లెబనాన్ రాదని వాదిస్తూ వచ్చిన ఇజ్రాయిల్ బరితెగించింది. ఒప్పందం కుదరిన 24 గంటల్లోనే లెబనాన్‌పై భీకర దాడికి దిగింది. బుధవారం రాత్రి పది నిమిషాల వ్యవధిలోనే లెబనాన్‌లోని పలు ప్రదేశాలపై వందకు పైగా వైమానిక దాడులు చేసింది. . ఇజ్రాయిల్ చేసిన ఈ భయానక దాడిలో 254 మంది మృతి చెందినట్లు ‘అల్ జజీర’ తెలిపింది. లెబనాన్ అధికారవర్గాలను ఉటంకిస్తూ ప్రచురించిన కథనంలో ఈ దాడుల్లో 1,165 మందికి పైగా గాయపడ్డారని, వీరిలో పలువురి పరిస్థితి ఆందోళన కరంగా ఉందని పేర్కొంది. దీంతో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మరోమారు మూసివేసింది. కాల్పుల విరమణ ఒప్పందానికి భిన్నంగా ఇజ్రాయిల్ చేసిన దాడులకు నిరసనగా జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. నిజా నికి అంతకు కొన్ని గంటల ముందే ఇరాన్ ఈ మేరకు ప్రకటించింది. బుధవారం ఉదయం నుండి లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రస్తావిస్తూ వాటిని కొనసాగిస్తే హర్మూజ్‌ను మూసివేసి, ఒప్పందం నుండి బయటకు వచ్చేస్తామని హెచ్చరించింది. అయితే, ఈ హెచ్చరికను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఇజ్రాయిల్ భీకర దాడులకు తెగబడింది. 1982 తరువాత లెబనాన్‌పై ఇదే అతి పెద్ద దాడి అని చెబుతున్నారు. దాడుల్లో లెబనాన్‌లోని ప్రముఖ మత పెద్ద సాదిక్ అలీ నబుల్సీ మరణించారు. లెబనాన్ రాజధాని బీరూట్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి.

## యుద్ధానికి తాత్కాలిక బ్రేక్! రెండు వారాలు కాల్పుల విరమణ !




**హైదరాబాద్ పెన్ పవర్:** గత నెల రోజులకు పైగా ప్రపంచ దేశాలను వణికించిన పశ్చిమాసియా యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. రెండు వారాల పాటు ఇరాన్‌పై బాండు దాడులను నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం ప్రకటించారు. ఇరాన్ పంపిన 10 పాయింట్ల ప్రతిపాదన ప్రాతిపదికన ఇరాన్‌తో ప్రత్యక్ష చర్చలు ఈ నెల 10న ప్రారంభమవుతాయని ప్రకటించారు. అయితే హార్మూజ్ జలసంధిని తెరవాలన్న షరతుకు లోబడే ఈ చర్చలు జరుగుతాయని ట్రంప్ స్పష్టం చేశారు. ఇది తాము సాధించిన విజయంగా ట్రంప్ చెప్పుకున్నారు. మరోవైపు ఇరాన్ కూడా తన వైఖరిని స్పష్టం చేసింది. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు తమపై దాడులు నిలిప ?వేసినట్లైతే, తాము కూడా దాడులను ఆపుతామని ప్రకటించింది. తమ సాయుధ బలగాల సమన్వ యంతోనే హార్మూజ్‌లో నౌకల రవాణా కొనసాగు తుందని తెలిపింది. ఇది ఇరాన్ సాధించిన దౌత్య విజయం అని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చి ఒక ప్రకటన విడుదల చేశారు. లెబనాన్‌తో సహా అన్ని రంగాల్లో తక్షణమే కాల్పుల విరమణ జరిపేందుకు అన్ని పక్షాలు, వాటి మిత్రపక్షాలు అంగీకరించాయని పాకిస్తాన్ వెల్లడించింది. ఇరు పక్షాల మధ్య కాల్పుల విరమణ కోసం ఇప్పటివరకు మధ్యవర్తిత్వం నెరిపిన పాకిస్తాన్ ఈ నెల 10న జరిగే ప్రత్యక్ష చర్చలకు ఆతిథ్యం ఇవ్వనున్నట్ల ప్రకటించింది. శుక్రవారం ఇరు పక్షాలు ప్రత్యక్ష చర్చల కోసం ఇస్లామాబాద్‌కు రావాల్సిందిగా ప్రధాని షరీఫ్ ఆహ్వానించారు. లెబనాన్‌తో సహా అన్ని చోట్లా తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని ఆయన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

## పాక్‌పై మాకు నమ్మకం లేదు: ఇజ్రాయెల్ రాయబారి



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణకు సంబంధించిన చర్చల్లో పాకిస్థాన్ పాత్రపై ఇజ్రాయెల్ సందేహం వ్యక్తంచేసింది. ఇస్లామాబాద్ మధ్యవర్తిత్వంపై తమకు నమ్మకం లేదని పేర్కొంది. భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ రాయబారి మాట్లాడుతూ.. పాకిస్థాన్‌ను తాము విశ్వసించలేమని, అమెరికా తన స్వప్రయోజనాల కోసం దాని మధ్యవర్తిత్వాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకొందని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఖతార్, తుర్కియే వంటి సమస్యాత్మక దేశాల ద్వారా హమాస్‌తో అమెరికా కుదుర్చుకొన్న ఒప్పందం గురించి ఆయన ప్రస్తావించారు. ఇరాన్‌లో తాము అనుకున్న లక్ష్యాలు సాధించేందుకు యూఎస్ సమన్వయంతో ముందుకుసాగడం తమకు చాలా ముఖ్యమన్నారు. ఇక, అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణకు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అయితే, లెబనాన్‌పై మాత్రం తమ సైనిక చర్యలు కొనసాగుతాయని పునరుద్ఘాటించారు. ఇరాన్‌పై జరిపిన ఆపరేషన్‌కు, లెబనాన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి హెజ్‌బొల్లా మౌలిక సదుపాయాలను పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యమన్నారు. అది ఇజ్రాయెల్ బాధ్యతగా అభివర్ణించారు.

## ఏది మూఢనమ్మకమో నిర్ణయించగలం!



**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూఢిల్లీ: మత విశ్వాసాలు, ఆచారాలకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానంలో కీలకమైన వాదోపవాదనలు జరిగాయి. మతాచారాల్లో ఏది మూఢనమ్మకం, ఏది మూఢనమ్మకం కాదో నిర్ణయించే, విచారణ జరిపే న్యాయాధికారం, పరిధి తమకు ఉన్నాయని సుప్రీంకోర్టు జడ్జీలు పేర్కొన్నారు. ‘న్యాయమూర్తులు.. చట్టాల విషయంలో మాత్రమే నిపుణులు, మత విషయాల్లో కాదు. కాబట్టి న్యాయస్థానాలు మతాచారాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేవు’ అన్న కేంద్ర ప్రభుత్వ వాదనకు ప్రతిస్పందనగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ‘శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళల పట్ల వివక్ష’ కేసులో రెండో రోజైన బుధవారం కూడా విచారణ కొనసాగింది. మత స్వేచ్ఛకు సంబంధించి ఏడు ప్రశ్నలను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం రూపొందించింది. ‘ఒక ఆచారం మూఢనమ్మకమని కోర్టు ఎలా నిర్ణయిస్తుంది? ఒకవేళ అది మూఢనమ్మకమని భావించినప్పటికీ, దానిని నిర్ధరించాల్సింది కోర్టు కాదు. రాజ్యాంగ అధికరణం 25(2)(బి) ప్రకారం చట్టసభలు మాత్రమే సంస్కరణ శాసనాలను తీసుకురావాల్సి ఉంటుంది’ అని కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. ఈ వాదనను జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా తోసిపుచ్చారు. ‘ఏదైనా మతాచారం మూఢనమ్మకమా, కాదా అని నిర్ణయించే అధికారం న్యాయస్థానానికి ఉంది. ఆ తర్వాత ఏం చేయాలనేది చట్టసభ చూసుకుంటుంది.

చట్టసభల నిర్ణయమే అంతిమం అని కోర్టులో చెప్పలేరు’ అని జస్టిస్ అమానుల్లా తెలిపారు. ‘ఏది తప్పనిసరి మతాచారమో నిర్ణయించేటప్పుడు కోర్టులు ఆ నిర్దిష్ట మతానికి చెందిన తాత్వికతను మాత్రమే ఆధారంగా చేసుకోవాలి. మరో మతంలోని అభిప్రాయాలను దీనికి వర్తింపజేసి తప్పనిసరి ఆచారం కాదని చెప్పలేరు’ అని జస్టిస్ బి.వి.నాగరత్న తెలిపారు.

## కాల్పుల విరమణ వెనుక చైనా
## చైనా చొరవ వల్లే సాధ్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్, అమెరికా మధ్య ఆకస్మికంగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి కీలక సమాచారం బయటికొచ్చింది. చర్చలకు ఇరాన్‌ను అంగీకరించేలా చేయడంలో చైనా కీలక పాత్ర పోషించిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్వయంగా చెప్పారు. చైనా చొరవ చూపి ఉండకపోతే ఒప్పందం సాధ్యపడేదే కాదని కూడా ఆయన అన్నారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందం వెనుక తన ప్రమేయంపై చైనా ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ ఆ దేశం తెర వెనుక దౌత్యం నెరిపింది. పాకిస్తాన్, టర్కీ, ఈజిప్ట్ వంటి మధ్యవర్తిత్వ దేశాల ద్వారా ఇరాన్‌కు తన సందేశాన్ని పంపింది. ఘర్షణ మరింత తీవ్రమైతే పశ్చిమాసియాకే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కూడా అపార నష్టం జరుగుతుందని ఆయా దేశాల ద్వారా ఇరాన్‌కు నచ్చచెప్పింది. అయినప్పటికీ అది తన పాత్రను అధికారికంగా చెప్పుకోలేదు. అన్ని పక్షాలు చిత్తశుద్ధిని కనబరచాయని, ఘర్షణకు సాధ్యమైనంత త్వరగా ముగింపు పలికేందుకు కృషి చేశాయని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ చెప్పారు. హార్మూజ్ జలసంధిలో ప్రయాణించే వాణిజ్య నౌకలకు రక్షణగా అంతర్జాతీయ సహకారాన్ని పెంచుకోవాలంటూ ఐరాస భద్రతా మండలిలో ప్రవేశపెట్టిన తీర్మానానికి రష్యాతో పాటు చైనా కూడా వీటో చేసింది. ఈ చర్యపై ఐరాసలో అమెరికా రాయబారి మైక్ వాల్ట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే చైనా ఇక్కడ రెండు రకాల వ్యూహాన్ని అనుసరించింది. ఒక వైపు అమెరికా నేతృత్వంలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూనే మరో వైపు శాంతి కోసం తెర వెనుక ప్రయత్నాలు చేసింది.

## బహుళ ప్రయోజనాల యూఏవీ నిర్మించనున్న భారత్

**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూఢిల్లీ: యుద్ధ విమానాలు కూలినప్పుడు అందులోని సిబ్బందిని రక్షించేందుకు ఉపయోగపడే మానవ రహిత వైమానిక వాహనం (యూఏవీ) రూపొందించాలని భారత్ యోచిస్తున్నట్టు అధికారులు తెలిపారు. దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ వైమానిక వాహనాన్ని యుద్ధభూమికి, నివాస యోగ్యం కాని ప్రదేశాలకు, హిమ శిఖరాలకు, పర్వత ప్రాంతాలకు పరికరాలు, సరుకులు సిబ్బందిని చేర్చేందుకు కూడా ఉపయోగించేలా తీర్చిదిద్దనున్నారు. డిఫెన్స్ అక్విజిషన్ ప్రొసీజర్ (డీఏపీ) 2020 కింద చేపట్టే ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని అధికార వర్గాలు తెలిపాయి. రక్షణ రంగంలో దేశ ఆత్మనిర్భరతకు ఈ ప్రాజెక్టు ఊతమందిస్తుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. దేశీయంగా రూపొందించి ఉత్పత్తి చేసే ప్రాతిపదికన దీన్ని రూపొందిస్తారు. కనీసం 400 కేజీల బరువు మోసేలా ఈ వైమానిక వాహనాన్ని తయారు చేయాలని యోచిస్తున్నారు.

ఈ వాహనం తనంత తానుగా ఎలాంటి రన్‌వే లేకుండా గాల్లోకి ఎగరడంతోపాటు, గాలింపు, లక్ష్యాల గుర్తింపు వంటి చర్యలకు కూడా ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఎమర్జెన్సీ లొకేటర్ ట్రాన్స్‌మిటర్ పరిజ్ఞానాన్ని ఇందులో ఉపయోగించనున్నారు.

## లెబనాన్‌పై దాడుల్లో 112 మంది మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ఒకపక్క శాంతి వీచికలు మొదలైన తరుణంలో లెబనాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల మోత మోగించింది. ఎలాంటి ముందస్తు హెచ్చరికల్లేకుండా బుధవారం మధ్యాహ్నం పదినిమిషాల వ్యవధిలోనే వందకు పైగా లక్ష్యాలపై దాడులకు పాల్పడింది. దీనిలో 112 మంది ప్రాణాలు కోల్పోగా సుమారు 700 మంది గాయపడ్డారు. శాంతి ఒప్పందంలో లెబనాన్‌ను చేర్చలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్, హెజ్‌బొల్లాపై దాడులు ఆపబోమని ఇజ్రాయెల్ స్పష్టంచేసిన కొన్ని గంటల్లోనే ఇది చోటుచేసుకుంది. లెబనాన్ రాజధాని బీరుట్‌తో పాటు పలుచోట్ల జనసమ్మర్ద ప్రాంతాల్లో బాంబు దాడులు జరిగాయి. 100కు పైగా అంబులెన్సులు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. క్షతగాత్రులతో ఆసుపత్రులు కిక్కిరిసిపోయాయి. తీరప్రాంత రాజధాని నగరమైన బీరుట్‌లో పలుప్రాంతాల్లో దట్టమైన మంటలు, నల్లని పొగలు కనిపించాయి. పలు అపార్ట్‌మెంట్లు దెబ్బతిన్నాయి. ఇప్పటివరకు లెబనాన్‌లో చేపట్టిన అతిపెద్ద దాడి ఇదేనని ప్రభుత్వం పేర్కొంది. లెబనాన్‌లో 1982 తర్వాత ఎన్నడూ లేనివిధంగా తాజా వైమానిక దాడులు జరిగాయి. సాధారణంగా హెజ్‌బొల్లాకు సంబంధంలేని ప్రాంతాలుగా భావించే బీరుట్‌లోని సున్నీ నివాస ప్రాంతాలపై కూడా దాడులు జరిగాయి. దాడుల్లో ఒక నివాస భవనం పూర్తిగా నేలమట్టమై ముగ్గురు పౌరులు మరణించినట్లు సమాచారం. తూర్పు లెబనాన్‌లోని శంస్తర్ గ్రామంలో ఒక శ్మశానంలో అంత్యక్రియలు జరుగుతుండగా వైమానిక దాడిలో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. సైడా నగరంలో ఒక కేఫ్‌పై జరిగిన దాడిలో 8 మంది మరణించారు. ఇజ్రాయెల్ దాడులను లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ తీవ్రంగా ఖండించారు. ఇవి అనాగరికంగా, అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించేవిగా ఉన్నాయని ఆక్షేపించారు.

## తమిళనాడు సీఎస్‌గా తెలంగాణ వ్యక్తి



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై: తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా తెలంగాణకు చెందిన సాయికుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల సందడి నెలకొన్న నేపథ్యంలో, కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది.ప్రస్తుత సీఎస్ మురుగానందాన్ని బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో 1990 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సాయికుమార్‌ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల వేళ పారదర్శకమైన పాలనను అందించే బాధ్యతను కమిషన్ ఆయనకు అప్పగించింది.సాయికుమార్ తెలంగాణలో జన్మించారు. ఆయన విద్యాభ్యాసం హైదరాబాద్‌లోనే సాగింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (ఊఅజ)లో పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసిన ఆయన, మద్రాస్ విశ్వవిద్యాలయం నుండి పబ్లిక్ అఫైర్స్ విభాగంలో పీహెచ్‌డీ (ఖఫ్త్రఆ) పట్టా పొందారు. అకడమిక్ పరంగా అత్యున్నత ప్రమాణాలు కలిగిన ఆయన, సివిల్ సర్వీసెస్‌లో కూడా తనదైన ముద్ర వేశారు. 1990లో తమిళనాడు కేడర్ ఐఏఎస్‌గా బాధ్యతలు చేపట్టిన సాయికుమార్, అసిస్టెంట్ కలెక్టర్ స్థాయి నుండి నేడు రాష్ట్రంలోనే అత్యున్నతమైన సీఎస్ హోదాకు చేరుకున్నారు. తన సుదీర్ఘ కెరీర్‌లో ధర్మపురి కలెక్టర్‌గా, మదురై కార్పొరేషన్ కమిషనర్‌గా, తమిళనాడు విద్యుత్ మండలి ఛైర్మన్‌గా పనిచేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడంలో ఆయనకు మంచి పేరుంది. 2018లో నాటి ముఖ్యమంత్రి పళనిసామికి ముఖ్య కార్యదర్శిగా వ్యవహరించి, పాలనా యంత్రాంగంలో కీలక పాత్ర పోషించారు. అనంతరం ప్రజాపనుల శాఖ కార్యదర్శిగా, 2021లో రెవెన్యూ పరిపాలన కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2022 నుండి తమిళనాడు న్యూస్‌ప్రింట్ అండ్ పేపర్స్ లిమిటెడ్ ఛైర్మన్‌గా సేవలందిస్తున్న ఆయన, ఇప్పుడు అత్యున్నత పీఠాన్ని అధిరోహించారు.

## మహిళా రిజర్వేషన్ చట్ట సవరణకు క్యాబినెట్ సమ్మతి!

**హైదరాబాద్ పెన్ పవర్:** : లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి 816కి పెంచి, వాటిలో 273 స్థానాలను మహిళలకు కేటాయించడానికి వీలుగా మహిళా రిజర్వేషన్ చట్టంలో మార్పులు చేసే ముసాయిదా బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు సమాచారం. 2029 సార్వత్రిక ఎన్నికల నుంచి దీనిని అమలు చేయాలని, దాని నిమిత్తం మూడు రోజులపాటు పార్లమెంటు సమావేశాలను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం మంత్రివర్గం సమావేశమైంది. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు రెండు బిల్లుల్ని పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సి ఉంది. ఆమోదం పొందితే ప్రతిపాదిత చట్టాలు 2029 మార్చి 31 నుంచి అమల్లోకి వస్తాయి. అంటే ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు జరిగే తదుపరి ఎన్నికల నుంచి వీరి స్థానాలు పెరగనున్నాయి.

## సమాధానం చెప్పలేక పోలీసుల ప్రయోగం

**హైదరాబాద్ పెన్ పవర్:** అస్సాం: అస్సాం సీఎం హిమంత బిస్వా శర్మ తన భార్యపై వస్తున్న అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పకుండా, ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు పోలీసులను వాడుకుంటున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా ఆరోపించారు. ఇవాళ రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తనపై అస్సాం ప్రభుత్వం కేసు నమోదు చేయడంపై తీవ్రంగా స్పందించారు. సీఎం భార్య రినికి భూయాన్ శర్మకు అమెరికాలోని వ్యోమింగ్ , ఉటా (జబిజీష్ట్ర) రాష్ట్రాల్లో బహుళ పాస్‌పోర్టులు, విదేశీ పెట్టుబడులు, షెల్ కంపెనీలు ఉన్నాయని ఖేరా గతంలో ఆరోపించారు. వీటికి సంబంధించి ఆధారాలతో సహా ప్రశ్నలు అడిగితే సీఎం సమాధానం ఇవ్వడం లేదని ఆయన విమర్శించారు. తాము మేము అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక, తనపైకి పోలీసులను పంపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని తన నివాసానికి వందమంది పోలీసులు వచ్చారని.. తాను ఎక్కడికి వెళ్లినా పోలీసులు నన్ను వెంబడిస్తున్నారని ఖేరా అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేపై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖేరా ఖండించారు. అదేవిధంగా ఖర్గే రాజకీయ అనుభవం శర్మ వయస్సు కంటే ఎక్కువని, పెద్దల పట్ల ఇలా ప్రవర్తించడం, ఇష్టానురీతిగా అస్సాం సంస్కృతి కాదని ఆయన హితవు పలికారు. తనపై అస్సాం పోలీసులు కేసు నమోదు చేయడంతో, పవన్ ఖేరా తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఏప్రిల్ 9న ఆ పిటిషన్‌పై విచారణ జరగనుంది.

# యుద్ధంతో భారత వృద్ధికి ముప్పు




పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపబోతున్నాయని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌బిఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపిజి) సమావేశం అనంతరం బుధవారం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. యుద్ధం వల్ల తలెత్తే పరిణామాలను ప్రస్తావించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం అంతర్జాతీయంగా అనిశ్చితిని పెంచిందన్నారు. ఇది భారత వృద్ధికి సవాలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గతంలో దేశీయ ఆర్థిక పునాదులు పటిష్టంగా ఉన్నప్పటికీ మార్చి నెలలో యుద్ధ తీవ్రత పెరగడంతో పరిస్థితులు ప్రతికూలంగా మారాయని ఆయన విశ్లేషించారు. ముడిచమురు ధరలు పెరగడం వల్ల దిగుమతి ద్రవ్యోల్బణం పెరగడమే కాకుండా, కరెంట్ అకౌంట్ లోటు (సిఎడి) మరింత విస్తరించే ప్రమాదం ఉందన్నారు. అధిక వ్యయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రుణగ్రహీతలు వడ్డీ రేట్లు తగ్గుతాయని ఆశించిన వారికి ఆర్‌బిఐ నిర్ణయం నిరాశకు గురి చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరపు తొలి సమీక్షలో రెపో రేటును 5.25 శాతం వద్దే యధాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. గతేడాది ఫిబ్రవరి ఫిబ్రవరి నుంచి దాదాపు 1.25 శాతం మేర రేట్లను తగ్గించిన ఆర్‌బిఐ ఈసారి మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ నిర్ణయం వల్ల బ్యాంకుల వద్ద వడ్డీ రేట్లు స్థిరంగా ఉండటమే కాకుండా పారిశ్రామిక వృద్ధికి, సామాన్యుల ఇఎంఐలపై భారం పడకుండా దోహదపడుతుందని గవర్నర్ పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల సరఫరా వ్యవస్థలో తలెత్తే అడ్డంకులు దేశంలోని పరిశ్రమలు, వ్యవసాయం, సేవా రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని గవర్నర్ మల్హోత్రా వివరించారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధిలో రవాణా ఆటంకాల వల్ల ముడివస్తువుల లభ్యత తగ్గి, దేశీయ ఉత్పత్తి క్షీణించవచ్చని హెచ్చరించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగిస్తే భారత ఎగుమతులు, రెమిటెన్స్‌ల ప్రవాహంపై ప్రభావం పడుతుందన్నారు. ఇది చివరకు దేశీయంగా అప్పుల భారాన్ని కూడా పెంచవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. "సరఫరా వ్యవస్థలో మొదలైన అడ్డంకులు పునరుద్ధరణలో ఆలస్యమైతే.. అది మధ్యకాలికంగా డిమాండ్ పడిపోవడానికి దారితీయవచ్చు" అని మల్హోత్రా హెచ్చరించారు.

# ఎన్‌బీఎఫ్‌సీలకు కొత్త మార్గదర్శకాలు




బ్యాంకింగ్, బ్యాంకింగేతర రంగాల్లో వ్యాపార నిర్వహణను మరింత సులభతరం చేసే దిశగా ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. టాటా సన్స్ లిస్టింగ్ అంశంపై ఇంకా స్పష్టత లేని నేపథ్యంలో, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) కోసం కొత్త ముసాయిదా తీసుకురానున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. కొత్త ముసాయిదా నిబంధనల ప్రకారం ఎన్‌బీఎఫ్‌సీలను వివిధ రకాలుగా వర్గీకరిస్తామన్నారు. ఉప్పు నుంచి సాఫ్ట్‌వేర్ వరకు విస్తరించిన టాటా గ్రూప్ ప్రధాన సంస్థ టాటా సన్స్, ప్రైవేట్‌గానే కొనసాగుతుందా లేదా పబ్లిక్ ఇష్యూకు (లిస్టింగ్) వెళుతుందా అనే అంశంపై స్పష్టమైన వివరాలు వెల్లడించేందుకు ఆర్‌బీఐ గవర్నర్ నిరాకరించారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం, అప్పర్ లేయర్ విభాగంలో ఉన్న 15 సంస్థల్లో ఒకటైన టాటా సన్స్, గతేడాది సెప్టెంబరు 30 నాటికే స్టాక్ మార్కెట్లో నమోదు కావాల్సి ఉంది. ఈ విభాగంలోని మిగిలిన సంస్థలన్నీ ఇప్పటికే ఈ నిబంధనను పాటించాయి. లైసెన్స్ రద్దయ్యే వరకు టాటా సన్స్, తన వ్యాపారాన్ని కొనసాగించొచ్చని ఆర్‌బీఐ గవర్నర్ గతంలో పేర్కొన్నారు. గడువు ముగిసి 6 నెలలు దాటినా, ఈ అంశంపై వ్యాఖ్యానించేందుకు బుధవారం నిరాకరించారు.ఫినో పేమెంట్స్ బ్యాంక్ సీఈఓ రిషీ గుప్తా అరెస్టుపై గానీ, స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌గా మారాలనే ఆ బ్యాంక్ లక్ష్యంపై ఈ అరెస్టు ప్రభావం గురించీ మల్హోత్రా స్పందించలేదు.బ్యాంకుల బోర్డు సమయాన్ని మరింత సమర్థంగా వినియోగించుకునేందుకు, వ్యూహాలు, నష్టభయం నిర్వహణపై మరింత దృష్టి సారించేలా మార్గదర్శకాలు సవరించనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. వీటికి సంబంధించిన ముసాయిదాను త్వరలో విడుదల చేస్తామని వెల్లడించింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాత్కాలిక చైర్మన్ అతాను చక్రవర్తి 'బ్యాంక్ పనితీరులో నైతిక కారణాలను ప్రస్తావిస్తూ' మార్చి 17న తన పదవికి హఠాత్తుగా రాజీనామా చేసిన నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంలో భాగంగా.. దాదాపు 9,000 పాత నియంత్రణ నిబంధనలను కుదించి, 238 మాస్టర్ డైరెక్షన్లుగా క్రోడీకరించే ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. పర్యవేక్షణ సూచనలకు సంబంధించి 9 విభాగాలకు చెందిన 64 మాస్టర్ డైరెక్షన్స్ ముసాయిదాలను ప్రజల అభిప్రాయాల కోసం ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

# ఏడేళ్ల తర్వాత భారత్‌కు ఇరాన్ ఆయిల్




భారత ఇంధన రంగంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా ఆంక్షల కారణంగా గత ఏడేళ్లుగా నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురు దిగుమతులు మళ్ళీ ప్రారంభమయ్యాయి. రాయిటర్స్ నివేదిక ప్రకారం, ఇరాన్ చమురుపై అమెరికా తాత్కాలికంగా ఆంక్షలను సడలించడంతో, భారత్ తన మొదటి షిప్‌మెంట్‌ను స్వీకరించడానికి సిద్ధమైంది. దీనితో పాటు, పశ్చిమ ఆసియాలో యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత్‌కు వస్తున్న చమురు నౌకలు క్షేమంగా హార్ముజ్ జలసంధిని దాటడం గమనార్హం. ఇరాన్ చమురు రాకతో ఇంధన భద్రత ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, 'జయ' అనే భారీ నౌక ద్వారా ఈ ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఈ నౌక ఈ వారం చివర్లో భారత తూర్పు తీరానికి చేరుకునే అవకాశం ఉంది. 2019లో అమెరికా ఆంక్షల తర్వాత ఇరాన్ నుండి దిగుమతులు పూర్తిగా ఆగిపోయాయి. ఇప్పుడు మళ్ళీ ఇరాన్ ఆయిల్ రావడం వల్ల భారత్‌కు ఇంధన వనరుల వేటలో మరిన్ని ఆప్షన్లు దొరికినట్లయింది. ఇదే కాకుండా 'జోర్డాన్' అనే మరో నౌక కూడా భారత్ వైపు వస్తున్నట్లు సమాచారం. క్షేమంగా వస్తున్న ఎల్‌పీజీ నౌకలు పశ్చిమ ఆసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇలాంటి సమయంలో కూడా 60,000 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ ఒఖఉని మోసుకెళ్తున్న రెండు భారతీయ నౌకలు 'గ్రీన్ సాంఘ్వీ' , 'గ్రీన్ ఆశా' హోర్ముజ్ జలసంధిని క్షేమంగా దాటాయి. 15,000 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీతో ఏప్రిల్ 9 నాటికి భారత్‌కు చేరుకోనుంది. ఈ నౌకల్లో మొత్తం 51 మంది భారతీయ నావికులు ఉన్నారు. వీరి భద్రతను కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. రక్షణగా నిలుస్తున్న ఇండియన్ నేవీ సముద్ర మార్గాల్లో వాణిజ్య నౌకలకు ఎలాంటి ముప్పు కలగకుండా భారత నావికాదళ యుద్ధనౌకలు సిద్ధంగా ఉన్నాయి. గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం 16 భారతీయ నౌకలు ఉండగా, అందులో దాదాపు 433 మంది భారతీయ నావికులు పనిచేస్తున్నారు. ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని ఓడరేవు కార్యకలాపాలు సాధారణంగానే సాగుతున్నాయని అధికారులు తెలిపారు.

# బంగారం, వెండి ధరల్లో ఎందుకీ ఊగిసలాట?



నిన్న భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు.. నేడు ఆల్ మోస్ట్ అంతేరీతిలో తగ్గాయి. గురువారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.2340 తగ్గి రూ.1,51,480కి పడిపోయింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.2,150 తగ్గి రూ.1,38,850 వద్ద కొనసాగుతోంది. మరోవైపు కిలో వెండి ధర రూ.5000 తగ్గి రూ.2,60,000 వద్ద స్థిరపడింది. లైవ్ ట్రేడింగ్ ను బట్టి ఈ ధరల్లో మార్పులుండవచ్చు. పెళ్లిళ్లు, శుభకార్యాలకు ముహూర్తాలు ఇబ్బడిముబ్బడిగా ఉన్న సమయంలో బంగారం, వెండి ధరలు ఇలా పెరుగుతూ, తగ్గుతూ ఊగిసలాడుతుండటంతో ఎప్పుడు కొనాలో, ఎప్పుడు ఆగాలో తెలియక కొనుగోలుదారులు అయోమయానికి గురవుతున్నారు. దీనికి కారణం ఏంటి? నిన్న 24 క్యారెట్ల బంగారం, 22 క్యారెట్ల బంగారం ధరల ఏకంగా మూడున్నర వేల రూపాయలకు పైగా పెరిగింది. ధరలు పెరగడంతో ఇన్వెస్టర్లు ప్రాఫిట్స్ తీసుకున్నారు. దీంతో నేడు బంగారం ధర తగ్గిందని నిపుణులు చెప్తున్నారు. బంగారంపై పెట్టుబడులు పెరిగితే ధర పెరుగుతుందని, లాభాలు తీసుకుంటే ధర తగ్గుతుందని చెప్తున్నారు. అంతేకాదు.. డాలర్ బలపడినా, బలహీన పడినా బంగారం, వెండి ధరల్లో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుంటాయి. మరోవైపు ట్రంప్.. ఇరాన్ పై యుద్ధం విషయంలో రోజుకో నిర్ణయం తీసుకుంటున్నారు. సీజ్ ఫైర్ ను మరో రెండువారాలకు పెంచిన ట్రంప్.. ఈ రోజు మళ్లీ మాస్ వార్నింగ్ ఇచ్చారు. ఇరాన్ ఒక్క తప్పు చేసినా మళ్లీ యుద్ధం మొదలవుతుందని హెచ్చరించారు. ట్రంప్ చేసే వ్యాఖ్యలతో ఇన్వెస్టర్లలో గందరగోళం నెలకొంది. నష్టాలు ఎక్కడ ముంచేస్తాయోనన్న ఆందోళన వారిని ప్రాఫిట్స్ వైపు మళ్లిస్తోంది. ప్రస్తుతానికైతే పశ్చిమాసియా యుద్ధంపైనే బంగారం, వెండి ధరలు ఆధారపడి ఉన్నాయి.

# అదానీ వినతిపై విచారణకు అమెరికా కోర్టు అనుమతి




అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతమ్ అదానీకి అమెరికా కోర్టులో ఊరట లభించింది. 'అమెరికా మదుపుదార్లను మోసగించామంటూ, అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ (ఎస్ఈసీ) మాపై నమోదుచేసిన కేసును కొట్టివేయాలంటూ' గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ పెట్టుకున్న వినతి దరఖాస్తుపై, విచారణకు అమెరికా కోర్టు న్యాయమూర్తి అనుమతి ఇచ్చారు. ఎస్ఈసీ నమోదు చేసిన కేసు అమెరికా న్యాయ పరిధిలోకి రాదని, పలు అంశాల్లో ఆధారాలు చూపించడంలోనూ విఫలమైందని అదానీ తరపు న్యాయవాదులు తెలిపారు. 'ఫిర్యాదు కొట్టివేయాలని అభ్యర్థిస్తూ, ప్రతివాదులు పంపిన లేఖ కోర్టుకు అందింది. వీరి వినతిని పరిగణనలోకి తీసుకుని విచారణకు హాజరుకావాలని ఇరు పక్షాలను ఆదేశించినట్లు' ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ఆఫ్ న్యూయార్క్ తన ఆదేశాల్లో తెలిపింది. 'భారత్‌లో కాంట్రాక్టులు పొందేందుకు అదానీ గ్రూప్ లంచం ఇచ్చేందుకు, అమెరికా మదుపర్ల సొమ్మును వినియోగించారనే' ఆరోపణలను సమర్థించే విశ్వసనీయ ఆధారాలను చూపించడంలో ఎస్ఈసీ విఫలమైందని అదానీ తరపు న్యాయవాదులు తెలిపారు. సౌర ఇంధన కాంట్రాక్టులను పొందేందుకు భారత్‌లో కొందరు పెద్దలకు 250 మిలియన్ డాలర్లను లంచం రూపంలో అదానీ చెల్లించారనే ఆరోపణలపై 2024 నవంబరులో ఎస్ఈసీ ఈ కేసును నమోదు చేసింది. సౌర ప్రాజెక్టుల కోసం నిధుల సమీకరణ సమయంలో ఈ విషయాన్ని అమెరికా పెట్టుబడిదార్లకు, బ్యాంకులకు అదానీ గ్రూప్ వెల్లడించలేదనీ ఆరోపించింది. ఈ ఆరోపణలన్నింటినీ అదానీ గ్రూపు ఖండించింది.

# ఒరాకిల్ ఊచకోత మరువకముందే అమెజాన్‌లో భారీగా లేఆఫ్‌లు!




ప్రముఖ ఐటీ దిగ్గజం ఒరాకిల్‌లో ప్రపంచ వ్యాప్తంగా 30 వేల మంది ఉద్యోగులపై వేటు వేసిన ఘటన మరువక ముందే ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్‌ఉద్యోగులపై పెద్ద ఎత్తున్న వేటు వేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏకంగా 14 వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఆసియా బిజినెస్ అవుట్ లుక్ ప్రకారం వచ్చే నెలలో ఈ లేఆఫ్‌లు ఉండబోతున్నాయి. అమెజన్ వెబ్ సర్వీసెస్, రిటైల్, హెచ్‌ఆర్ విభాగాల్లోని ఉద్యోగులపై వేటు పడబోతుందని తెలుస్తోంది. అయితే ఈ లేఆఫ్‌ల పై అమెజాన్ నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాగా 2025లో 14 వేల మందిని, ఈ 2026 ప్రారంభంలోనే మరో 16 వేల మందిని అమెజాన్ తొలగించింది. ఓ వైపు మైక్రోసాఫ్ట్, టీసీఎల్, యాక్సెంచర్, ఒరాకిల్ వంటి దిగ్గజ సంస్థలు వరుసగా ఉద్యోగులను తొలగిస్తుండగా అదే బాటలో అమెజాన్ సైతం వెళ్తుండటంతో తమ బతుకులు ఎప్పుడు రోడ్డున పడతాయో అనే ఆందోళన ప్రపంచ వ్యాప్తంగా ఆయా సంస్థలలోని ఉద్యోగుల్లో వ్యక్తం అవుతోంది.

## తక్కువ నూనెతో కరకరలాడే వంటలు



పండుగలు, ప్రత్యేక రోజు ఏదైన ఉందంటే.. చాలా మంది పిండివంటల్ని చేసుకుని తింటారు. కొన్నిసార్లు మామూలుగా కూడా ఇంట్లో పూరీ, వడ వంటివి చేస్తుంటారు. పిల్లలు ఇష్టంగా తింటారని ఇళ్లలో వడలు, పూరీ, గారెలు తరచూగా బ్రేక్‌ఫాస్ట్, స్నాక్స్‌గా కూడా చేస్తుంటారు. అయితే, పూరీ, వడ, గారెలు వంటివి చేసేటప్పుడు వాటిని ఎక్కువ ఆయిల్‌లో కాల్చాల్సి వస్తుంది. అప్పుడు ఆ వంటకం నూనె ఎక్కువగా పీల్చకుండా ఉండేందుకు కొన్ని ఉపాయాలు ఉన్నాయి. వాటితో ఎక్కువ నూనెతో ఇబ్బంది లేకుండా మీ వంటకాలు ఆయిల్‌ను లైట్‌గా పీల్చుకునే చేసుకోవచ్చు. అలాంటి టిప్స్ ఏంటో ఇక్కడ తెలుసుకుందాం..ఇంట్లో వడలు చేయాలనుకున్నప్పుడు సహజంగానే అవి మొత్తగా ఉండాలని పిండిని మెత్తగా రుబ్బుకుంటారు. కానీ, దీని వల్ల నూనె ఎక్కువగా పీల్చుకుంటాయి. అలా కాకుండా పిండిని నార్మల్‌గా మీడియం రేంజ్‌లో రుబ్బుకోవాలి. అలాగే, ఇక వడలు చేసేప్పుడు నూనె బాగా వేడెక్కిన తర్వాతే వడలు, గారెలు వేసి కాల్చుకోవాలి. తక్కువ వేడిగా ఉన్నప్పుడు వేస్తే అవి నూనెని ఎక్కువగా పీల్చుకుంటాయి. అలా అని మంటను ఎప్పుడు తక్కువ ఫ్లేమ్‌లో పెట్టుకోవటం కూడా చెయొద్దు. ఎక్కువ మంటపెట్టి వడల్ని వేయించుకోవాలి.అయితే, నూనెని మరీ ఎక్కువగా వేడి చేయొద్దు. మీడియం కంటే వేడిగా ఉండాలి. మరీ ఎక్కువ వేడి అయితే గారెలు పై పైన మాడిపోతాయి. లోపల పచ్చిగానే ఉంటాయి. అలాగే, గారెలు కరకరలాడుతూ ఉండాలంటే గారెల పిండిలో కొంచెం సేమ్యా కలపాలి. దాంతో పాటు గారెల పిండి మిక్సీ చేసిన 5 నిమిషాల లోపే గారెలను వేసుకుంటే నూనె పీల్చవు. గారెలు, వడలు, నూనెలో ఫ్రై చేసిన ఏ పదార్థాలనైనా అలానే తినకూడదు. వాటిని కాల్చుకున్న తర్వాత టిష్యూ, బటర్ పేపర్, కిచెన్ టవల్‌లో వేయాలి. అప్పుడే అందులోని నూనె తగ్గుతుంది. దీంతో ఎక్సెస్ ఆయిల్ ఆ పేపర్స్ పీల్చుకుంటాయి.ఈ చిట్కాలు ఫాలో అయితే ఎటువంటి భయం లేకుండా హ్యాపీగా తినవచ్చు.

## అందమైన పాదాల కోసం.. ఇంటి చిట్కాలతో రక్షణ!



ఎండల ఉధృతి పెరుగుతోంది. ఉక్కపోతా ఎక్కువైంది. ఈ కాలంలో చెప్పులపై మరింత జాగ్రత్త పడుతుంటారు. అయితే వేసవిలో ఫుట్‌వేర్‌తో పాటు ఫుట్‌కేర్ విషయంలో కూడా జాగ్రత్త పాటించాలి. ఎందుకంటే ఈ కాలంలో వేడి, చెమట, ఎండ వంటి అనేక కారణాలతో పాదాలు పొడిగా, పగిలిపోయి, సన్‌బర్న్‌కు గురయ్యే ప్రమాదముంది. ఈ సమస్యలను పరిష్కరించుకోవడానికి, పాదాలను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి కొన్ని సింపుల్ టిప్స్ పాటిస్తే సరిపోతుంది. అవేంటో తెలుసుకుందాం.స్క్రబ్బింగ్ వల్ల చనిపోయిన చర్మ కణాలు తొలగి, రక్తప్రసరణ మెరుగవుతుంది. ఇందుకు ఇంట్లో తయారుచేసిన ఫుట్ స్క్రబ్‌ను ఉపయోగించవచ్చు. చక్కెర లేదా కాఫీ పొడిని ఉపయోగించి స్క్రబ్ తయారు చేయవచ్చు. మడమలు, పాదాలకు రెండు వైపులా చర్మం త్వరగా పొడిగా, నలుపు రంగులోకి మారుతుంది. అందుకే ఆ ప్రాంతాలపై దృష్టి పెట్టాలి. మాయిశ్చరైజర్స్‌తో స్క్రబ్ చేసిన తర్వాత, చర్మాన్ని తేమగా, మృదువుగా ఉంచడానికి మాయిశ్చరైజర్ లేదా ఫుట్ క్రీమ్ అప్లై చేసుకోవాలి. తేమను లాక్ చేయడానికి, పొడి చర్మాన్ని వదిలించుకోవడానికి కొబ్బరి నూనె లేదా గ్లిజరిన్ వంటి పదార్థాలు రాసుకోవచ్చు.బయటకు వెళ్లే ముందు హానికరమైన ఖఎ కిరణాల నుంచి రక్షించడానికి కాళ్లకు, పాదాలకు సన్‌స్క్రీన్ అప్లై చేయవచ్చు. వేసవి కాలంలో చల్లటి నీటిలో కొన్ని చుక్కల పుదీనా లేదా టీ ఆయిల్‌ను కలిపి కాళ్లను కాసేపు అందులో నానబెట్టడం మంచిది. ఇలా చేస్తే ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించవచ్చు. ఎప్సమ్ సాల్ట్‌ఎప్సమ్ సాల్ట్‌ను గోరువెచ్చని నీటిలో కలిపి 15-20 నిమిషాల పాటు కాళ్లను నానబెట్టాలి. ఇలా చేస్తే అలసిపోయిన కండరాలు రిలాక్స్ అవుతాయి. ఇన్‌ఫ్లమేషన్ కూడా తగ్గుతుంది. పొడి చర్మం మృదువుగా తయారవుతుంది. శరీరాన్ని, చర్మాన్ని లోపల నుంచి హైడ్రేట్‌గా ఉంచడానికి రోజంతా పుష్కలంగా నీరు తాగాలి. సరైన హైడ్రేషన్ పొడి చర్మానికి చెక్ పెడుతుంది.

## ఆరోగ్యం జాగ్రత్త!
## మామిడి పండు తిన్నాక వీటిని ముట్టుకోవద్దు..



వేసవి ఆగమనంతోనే మార్కెట్‌లోకి మామిడి పండ్ల రాక మొదలవుతుంది. మన దేశం మామిడి పండ్లకు ఎంతో ప్రసిద్ధి. ప్రపంచంలో మరెక్కడా లభించనన్ని రకాల మామిడి పండ్లు భారత్ లో లభిస్తాయి. అంతేకాదు దేశంలోని మామిడిపండ్లు రకరకాల రుచుల్లో అందుబాటులో ఉంటాయి. ఈ మామిడి పండ్లను నేరుగా తినొచ్చు. జ్యూస్‌లుగా చేసుకుని తాగవచ్చు. మామిడి తాండ్ర, మామిడి కరేలా లాంటి పదార్థాలు తయారు చేసుకుని కూడా తినొచ్చు. అయితే ఈ మామిడిపండ్లు తిన్న తర్వాత ఓ ఐదు రకాల పదార్థాల జోలికి అస్సలు పోవద్దట. ఆ పదార్థాలేమిటో ఇప్పుడు చూద్దాం..మంచి నీళ్లు : మామిడి పండ్లు తిన్న తర్వాత కొంతసేపటి వరకు మంచినీళ్లను అస్సలు తాగొద్దట. అలా చేస్తే ఆరోగ్యంపై దుష్ప్రభావం పడుతుందట. కడపు నొప్పి, అసిడిటీ, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదట.
పెరుగు : మామిడి పండు తినగానే పెరుగు తీసుకుంటే శరీరం డీహైడ్రేట్ అవుతుందట. అందువల్ల అలాంటి అలవాటు ఉంటే తక్షణమే మానుకోవాలట. లేదంటే వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందట. అంతేగాక చర్మ సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉన్నదట.కాకరకాయ : మామిడి పండ్లు తిన్న తర్వాత కాకరకాయ తీసుకోవడం కూడా మంచిది కాదట. అలా చేయడంవల్ల వికారం, వాంతులు, శ్వాస తీసుకోవడంలో సమస్యలు వస్తాయట.ఘాటైన పదార్థాలు : మామిడి పండ్లు తిన్న తర్వాత ఘాటు పదార్థాలుగానీ, కారం పదార్థాలుగానీ తీసుకుంటే ఉదర సంబంధ సమస్యలు, చర్మ సమస్యలు వచ్చే అవకాశం ఉన్నదట. అంతేగాక ముఖంపై మొటిమలు వచ్చే ప్రమాదం కూడా ఉన్నదట.చల్లటి పానీయాలు : మామిడి పండ్లతోపాటు చల్లటి పానీయాలు తీసుకోవడం కూడా ఆరోగ్యానికి హానికరమట. చల్లటి పానీయాలతో మామిడి పండ్లను తీసుకోవడంవల్ల షుగర్ లెవల్స్ మరింత పెరుగుతాయట.

# వేసవి తాపానికి చలువనిచ్చే అమృతం.. మజ్జిగ!



వేసవిలో చలువ చేసే పదార్థాలకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. మండే ఎండల నుంచి ఉపశమనం పొందడంలో ఇవి చాలా బాగా ఉపయోగపడతాయి. అలా చలువ చేసే పదార్థాల్లో మజ్జిగ ముందు వరుసలో ఉంటుంది. వేసవి తాపం పోవాలంటే ఒక్క గ్లాస్ మజ్జిగ తాగితే చాలు మస్త్ రిలీఫ్ ఉంటుంది. అయితే మజ్జిగను ఎప్పుడూ ఒకటే రీతిలో తాగాలంటే కాస్త బోరింగే. ఇక పిల్లలతై వద్దని ఏడుపు మొహం పెడతారు. అందుకే మజ్జిగను రకరకాల వెరైటీలుగా తాగడంతో పాటు చారులు కూడా చేసుకోవచ్చు. అవి ఎలా తయారు చేసుకోవాలో తెలుసుకుందాం...

**పుదీనా మజ్జిగ**

కావాల్సిన పదార్థాలు: జీలకర్ర - టేబుల్ స్పూన్, ధనియాలు -- ముప్పావు టేబుల్ స్పూన్, ఇంగువ - పావు టీస్పూన్, ఐస్ క్యూబ్స్ - రెండు, కొత్తిమీర -- కొద్దిగా, పచ్చిమిర్చి -- రెండు, పుదీనా ఆకులు -- అర కప్పు, ఉప్పు -- రుచికి సరిపడా, బ్లాక్ సాల్ట్ -- అర టీస్పూన్, పెరుగు -- ఒకటిన్నర కప్పులు.

తయారీ విధానం: జీలకర్ర, ధనియాలు లో ఫ్లేమ్‌లో వేయించాలి. సగం పైనే వేగినాక ఇంగువ వేసి కలిపి మరికాసేపు వేయించాలి. జీలకర్ర, ధనియాలు మంచి గోల్డెన్ కలర్‌లోకి మారినాక పక్కన పెట్టి చల్లారనివ్వాలి. ఈలోపు కొత్తిమీర సన్నగా తరగాలి. పుదీనా ఆకులను కొలత ప్రకారం తీసుకోవాలి. మిక్సీజార్‌లోకి వేయించిన జీలకర్ర మిశ్రమం, కొత్తిమీర తరుగు, పుదీనా ఆకులు, ఐస్‌క్యూబ్స్, పచ్చిమిర్చి, ఉప్పు, బ్లాక్ సాల్ట్, పెరుగు వేసి వీలైనంత మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. మిశ్రమాన్ని ఓ గిన్నెలోకి తీసుకొని మీగడ లేని పెరుగును వేసి బాగా కలపాలి. తర్వాత కప్పు పెరుగుకు మూడు కప్పుల చొప్పున నీరు పోసుకోవాలి. మరో ఐదు నిమిషాలు బాగా కలిపి చల్లచల్లగా సర్వ్ చేసుకుంటే ఎంతో టేస్టీగా ఉండే పుదీనా మజ్జిగ రెడీ.

**మునక్కాడల మజ్జిగ పులుసు**

**కావాల్సిన పదార్థాలు:** నాలుగు - మునక్కాయలు, అరటీస్పూన్ - పసుపు, రుచికి తగినంత - ఉప్పు, రెండు కప్పులు - పెరుగు, నాలుగు టీస్పూన్లు - శనగపిండి, టీస్పూన్ - అల్లం, నాలుగైదు టేబుల్ స్పూన్లు- నూనె, అరటీస్పూన్ - మెంతులు, టీస్పూన్ -జీలకర్ర, పచ్చిమిర్చి - పది, కొద్దిగా - కరివేపాకు, రెండు - ఉల్లిగడ్డలు, కొద్దిగా - కొత్తిమీర తరుగు, ఒకటి - నిమ్మకాయ

**తయారీ విధానం:** మునక్కాయలను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. వాటిపై తొక్కను తీసి శుభ్రంగా కడగాలి. వెడల్పాటి గిన్నెలో మునక్కాయ ముక్కలు వేసి, అవి మునిగేంత వరకు నీళ్లు, పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి మునక్కాడలు కాస్త మెత్తబడే వరకు బాగా ఉడికించుకొని పక్కన పెట్టుకోవాలి. మరో పెద్ద గిన్నె తీసుకుని అందులో కాస్త పుల్లగా ఉండే పెరుగు, శనగపిండి వేసుకుని విస్కర్‌తో ముద్దలు లేకుండా బాగా మిక్స్ చేసుకోవాలి. తర్వాత అందులో మూడు కప్పుల నీళ్లు పోసుకుని మరోసారి బాగా కలపాలి. ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి ఆయిల్ వేడి చేసి అందులో మెంతులను వేసి దోరగా ఫ్రై చేయాలి. తర్వాత ఆవాలు, జీలకర్ర వేసి వేయించాలి. తర్వాత పచ్చిమిర్చి చీలికలు, కరివేపాకు, కొద్దిగా అల్లంపేస్ట్‌ను వేసి పచ్చివాసన పోయేంత వరకు ఫ్రై చేయాలి. అనంతరం ఉల్లిగడ్డ తరుగు వేసి దోరగా వేయించుకోవాలి. అందులో ముందుగా ఉడికించి పక్కన పెట్టుకున్న మునక్కాడలను వాటర్ వడకట్టి వేసుకుని ఆయిల్‌లో రెండు మూడు నిమిషాలు కలుపుతూ ఫ్రై చేసుకోవాలి. అందులో మజ్జిగ మిశ్రమం, మునక్కాడలు ఉడికించుకున్న నీళ్లను కూడా వేసుకుని బాగా కలుపుకోవాలి. తర్వాత స్టవ్‌ను మీడియం ఫ్లేమ్‌లో ఉంచి మధ్యమధ్యలో కలుపుతూ ఏడెనిమిది నిమిషాలు ఉడికించుకోవాలి. అది బాగా మరిగి బుడగలు వస్తున్నపుడు కొద్దిగా కొత్తిమీర తరుగును వేసి, నిమ్మరసాన్ని పిండి ఓసారి కలిపి స్టవ్ ఆఫ్ చేసుకుంటే చాలు. అంతే కమ్మని మునక్కాడ మజ్జిగ పులుసు రెడీ అవుతుంది!

**సొరకాయ మజ్జిగ చారు**

**కావాల్సిన పదార్థాలు:** పెరుగు - 600 ఎంఎల్, ఒకటిన్నర కప్పులు - సన్నని పచ్చికొబ్బరి ముక్కలు, టేబుల్ స్పూన్ - ఆవాలు, ఒకట్రెండు టేబుల్ స్పూన్లు - బియ్యం, నాలుగైదు - పచ్చిమిర్చి, టీస్పూన్-మిరియాలు, అల్లం-అంగుళం ముక్క, సొరకాయ - ఒకటి, రెండు రెమ్మలు -- కరివేపాకు, రుచికి సరిపడా - ఉప్పు, పిడికెడు- కొత్తిమీర తరుగు.

**తయారీ విధానం:** ముందుగా ఒకటిన్నర కప్పుల పచ్చికొబ్బరిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. అందులో మిరియాలు, ఆవాలు, సన్నని అల్లం ముక్కలు, బియ్యం, పచ్చిమిర్చి తుంపలు వేసుకొని తగినన్ని నీళ్లు పోసి అరగంట నానబెట్టుకోవాలి. ఈలోపు సొరకాయ చెక్కు తీసి పెద్ద పెద్ద ముక్కలుగా కోయాలి.

అందులో ఎనిమిది కప్పుల మంచి నీళ్లు, కరివేపాకు, రుచికి తగినంత ఉప్పు వేసి కలపాలి. మీడియం ఫ్లేమ్‌లో సొరకాయ ముక్కలు సాఫ్ట్‌గా మారేంత వరకు ఉడికించుకోవాలి. మరీ మెత్తగా మగ్గించకూడదు. ఈలోపు నానబెట్టుకున్న పచ్చికొబ్బరి మిశ్రమాన్ని మెత్తని పేస్ట్‌లా పట్టి పక్కనుంచాలి. సొరకాయ ముక్కలు ఉడికిన తర్వాత అందులో పచ్చికొబ్బరి పేస్ట్ వేసి బాగా కలపాలి. స్టవ్‌ను హై-ఫ్లేమ్‌లో ఉంచి రెండు పొంగులు వచ్చేంతే వరకు మగ్గించుకొని దించి చల్లారనివ్వాలి. ఈలోపు ఒక గిన్నెలో పుల్లని పెరుగును తీసుకుని విస్కర్‌తో ఉండలు లేకుండా బాగా చిలికి కొన్ని నీళు పోసి పలుచగా చేయాలి. దీన్ని చిలికిన సొరకాయ మిశ్రమంలో పోసుకోవాలి. అలాగే సన్నని కొత్తిమీర తరుగు, మూడు నుంచి నాలుగు కప్పుల వరకు నీళ్లు పోసి బాగా కలుపుకొని తాలింపు వేసుకుంటే సరి.

**పాలకూర కాంబోలో**

**కావాల్సిన పదార్థాలు:** పాలకూర - రెండు కట్టలు, నూనె - రెండు టేబుల్ స్పూన్లు, తాలింపు గింజలు -- టీస్పూన్, ఎండుమిర్చి రెండు, వెల్లుల్లి రెబ్బలు -- మూడు, కరివేపాకు -- రెండు రెమ్మలు, పసుపు -- అర టీస్పూన్, పచ్చిమిర్చి -- రెండు, ఇంగువ చిటికెడు, ఉప్పు -- రుచికి సరిపడా, కారం -- టీస్పూన్, పెరుగు -- కప్పు, ఉల్లిగడ్డ -- ఒకటి, కొత్తిమీర తరుగు -- కొద్దిగా.

తయారీ విధానం: పాలకూర శుభ్రంగా కడిగి సన్నగా తరిగి పక్కన ఉంచాలి. అదే విధంగా ఉల్లిగడ్డ, పచ్చిమిర్చిని సన్నగా, పొడుగ్గా కట్ చేసుకోవాలి.

కొత్తిమీర, వెల్లుల్లి రెబ్బలను సన్నగా తరగాలి. పాన్‌లో నూనె వేడి చేసి ఆవాలు, జీలకర్ర చిట్లినాక ఎండుమిర్చి, వెల్లుల్లి తరుగు, కరివేపాకు వేసి ఫ్రై చేయాలి. తర్వాత పచ్చిమిర్చి చీలికలు, ఇంగువ, పాలకూర తరుగు, రుచికి సరిపడా ఉప్పు, పసుపు వేసి కలిపి మీడియం ఫ్లేమ్‌లో మగ్గించాలి. పాలకూర నూనెలో సరిగ్గా వేగినాక కారం వేసి కలిపి మరికాసేపు వేయించాలి. కారం కూడా మగ్గినాక స్టవ్ ఆఫ్ చేసి పూర్తిగా చల్లారనివ్వాలి. ఈలోపు మరో గిన్నెలోకి చిక్కటి పెరుగు, అర కప్పు నీళ్లు పోసి ఉండలు లేకుండా కలుపుకోవాలి. చల్లారిన పాలకూర మిశ్రమంలోకి కలిపి పెట్టుకున్న పెరుగును వేసి బాగా కలపాలి. చివరగా కట్ చేసిన ఉల్లిగడ్డ, కొత్తిమీర తరుగు వేసి మిక్స్ చేసుకుంటే ఎంతో టేస్టీగా ఉండే పాలకూర పెరుగు పచ్చడి రెడీ.

# మితంగా నూనె.. అమితంగా ఆరోగ్యం!

ఆరోగ్యమే మహాభాగ్యం: నూనె వాడకం తగ్గిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం!

తక్కువ నూనె - ఎక్కువ ఆరోగ్యం: వంటల్లో నూనె వాడకం తగ్గించే మార్గాలివే!

నూనెకు 'చెక్' పెడదాం.. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకుందాం!

ఆయిల్ వాడకం తగ్గించాలా? ఈ చిట్కాలు పాటించి చూడండి!

వంటల్లో నూనె వాడకం తగ్గించి.. ఫిట్‌గా ఉండండిలా!



చాలా కూరలు వండటానికి ఉల్లిపాయ, టమాట ముక్కలను నూనెలో వేయిస్తుంటాం. దీంతో వాటికి నూనె బాగా పట్టుకొని అవి ఉడికేదాకా వెయిట్ చేయాల్సి ఉంటుంది. ఇలా నేరుగా కాకుండా వీటిని ముందుగానే పేస్ట్‌లా తయారు చేసుకుంటే నూనె వాడకం తగ్గించవచ్చు. ఉల్లిపాయ, టామోటా ముక్కలను మిక్సీ పట్టి, కూరలు వండేటప్పుడు నూనెలో వేసుకుంటే త్వరగా వేగుతాయి. దీనికి ఆయిల్ కూడా పెద్దగా అవసరం ఉండదు. కూరలో ఆయిల్ వేయకపోతే అది మాడిపోతుంది. అయితే, కొంచెం ఓపిక పడితే ఇక్కడ కూడా నూనె వినియోగాన్ని తగ్గించవచ్చు. స్టవ్‌ను మీడియం ఫ్లేమ్‌లో పెట్టుకుని, కూర ఉడికేటప్పుడు మధ్యమధ్యలో మాడకుండా కొన్ని నీళ్లు చల్లుతూ ఉండాలి. నీళ్లు పోసినప్పుడు ఒకేసారి కాకుండా నెమ్మదిగా కలపాలి. కూరల్లో వివిధ సుగంధ ద్రవ్యాలు కచ్చితంగా వాడుతుంటారు. జీలకర్ర, ధనియాలు, లవంగం, దాల్చినచెక్క వంటివి నూనెలో వేసినప్పుడు అవి ఎక్కువ నూనెను గ్రహిస్తాయి. ఇలా నేరుగా వేయడానికి బదులుగా, ముందుగా వీటిని పొడి చేసుకోవడం లేదా నూనె లేకుండా నేరుగా వేయించుకోవడం మంచిది. డ్రై పాన్‌లో వీటిని వేయిస్తే వాటి అసలు ఫ్లేవర్స్ రిలీజ్ అవుతాయి. వీటిని పొడిగా చేసుకున్నాక కూర వండేటప్పుడు పొడులు వేసుకోవచ్చు. దీంతో తక్కువ నూనెను గ్రహిస్తాయి. పైగా, ఇవి వంటకు మరింత రుచిని అందిస్తాయి.గ్రేవీలా చేసే కూరలకు చిక్కదనం కోసం ఉడికించిన పప్పు, గుమ్మడికాయ గుజ్జు, తురిమిన సొరకాయ గుజ్జు వాడాలి. ఇవి కొవ్వు శాతాన్ని తగ్గించి వంటకు న్యూట్రిషనల్ రిచ్‌నెస్ అందిస్తాయి. పైగా గ్రేవీ చిక్కగా వస్తుంది, ఇందుకు నూనె కూడా పెద్దగా వాడాల్సిన అవసరం లేదు. ఈ నేచురల్ ఎడిటివ్స్‌తో ఫైబర్, విటమిన్లు అందడంతో పాటు కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది.

చాలా మంది కూర వండాక దానిపై ఒక చెంచా నెయ్యి లేదా నూనె పోసి గార్నిష్ చేస్తుంటారు. అయితే ఇలా ఆయిల్ కాకుండా ఫ్రెష్ హెర్బల్స్, నిమ్మరసం, మసాలా పొడితో గార్నిషింగ్ ట్రై చేసి చూడండి. కొత్తమీర, కసూరిమేథి, గరం మసాలా వంటివి వేసుకుంటే నూనె అవసరం లేకుండా వంట ఫ్లేవర్ రిచ్‌గా మారుతుంది.

# తక్కువ శ్రమతో ఎక్కువ మెరుపు.. ఇలా శుభ్రం చేద్దాం!



గ్యాస్ స్టౌవ్‌లో ఉండే బర్నర్స్‌ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం చాలా ముఖ్యం. సమయానికి శుభ్రం చేయకపోతే గ్యాస్ కూడా అధికంగా ఖర్చవుతుంది. అందుకే గ్యాస్ బర్నర్స్‌ను శుభ్రంగా ఉంచుకోవాలి. ముందుగా బర్నర్‌ని గ్యాస్ స్టౌవ్ నుంచి తీసి తర్వాత కాటన్ క్లాత్‌తో తుడవాలి. ఇప్పుడు ఒక స్పూను డిష్‌వాషింగ్ లిక్విడ్‌ని ఒక గిన్నెలోకి తీసుకుని దానికి ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు కలపాలి. ఆ నీళ్లలో బర్నర్స్ వేయాలి. నీళ్లు చల్లారిన తర్వాత బర్నర్‌ను తీసివేసి స్క్రాచ్ బ్రైట్‌తో శుభ్రం చేయాలి. ఇది పేరుకుపోయిన మురికితో పాటు నల్ల మచ్చలను నిమిషాల్లో తొలగిస్తుంది. ఇలా చేయడం వల్ల బర్నర్ కొత్తదానిలా మెరుస్తుంది. గ్యాస్ కూడా వృథా కాకుండా ఉంటుంది.
అలాగే నీటిని వేడి చేయండి ఒక టేబుల్ స్పూన్ డిష్ వాషర్ లిక్విడ్ తో పాటు దానికి కొద్దిగా సర్ఫ్ కలపాలి. ఈ నీటిలో ఒక నిమ్మకాయ రసం , టేబుల్ స్పూన్ బేకింగ్ సోడా కలపండి. ఇప్పుడు అందులో
గ్యాస్ బర్నర్ ఉంచండి. 20 నిమిషాల తర్వాత బర్నర్‌ను బ్రష్‌తో శుభ్రం చేయండి. ఇలా చేయడం వల్ల నిమిషాల్లో బర్నర్ శుభ్రం అవుతుంది. గోరువెచ్చని నీటిని తీసుకుని అందులో ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, ఒక టేబుల్ స్పూన్ ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ డిష్ వాషర్ లిక్విడ్ కలపాలి. ఇప్పుడు బర్నర్‌ని నీటిలో వేసి రెండు నిమిషాలు అలాగే ఉంచాలి. తర్వాత రాస్కోచ్ బ్రాట్ ఉపయోగించి బర్నర్‌ను శుభ్రం చేయండి. ఇలా చేయడం వల్ల నిమిషాల్లో బర్నర్ శుభ్రం అవుతుంది.

## ఆ ఒక్క నిర్ణయంతో గుజరాత్ జట్టులో గొడవ..

# శుభ్‌మన్ గిల్‌ను తిట్టిన ఆశిష్ నెహ్రా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో గుజరాత్ టైటాన్స్ జట్టు ఒక్క పరుగుతో ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ పై విజయం సాధించింది. చివరి బంతి వరకు ఉత్కంఠగా కొనసాగిన ఈ మ్యాచ్ అభిమానులను బాగా అలరించింది. కాగా ఈ మ్యాచ్‌లో గుజరాత్ జట్టు ప్రధాన కోచ్ ఆశిష్ నెహ్రా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ చేసిన ఒక తప్పిదంపై ఆయన తీవ్రంగా మండిపడ్డిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది. రెండో ఇన్నింగ్స్ 16వ ఓవర్‌లో జరిగిన ఓవర్ త్రో ఘటన మ్యాచ్‌ను మలుపుతిప్పేలా కనిపించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వికెట్‌కీపర్ జోష్ బట్లర్ వైపుకి నేరుగా బంతిని విసిరగా, అది స్టంప్స్‌ను తాకి బౌండరీకి వెళ్లిపోయింది. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు అదనంగా నాలుగు పరుగులు లభించాయి. ఆ సమయంలో క్రీజ్‌లో కేఎల్ రాహుల్, ట్రిస్టన్ స్టబ్స్ ఉన్నారు. ఈ ఘటనపై కోచ్ నెహ్రా డగౌట్ లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. అయితే బ్యాటింగ్‌లో గిల్ అద్భుతంగా ఆడాడు. 45 బంతుల్లో 70 పరుగులు చేసి జట్టు భారీ స్కోరు చేయడంలో కీలక పాత్ర పోషించాడు. అతని ఇన్నింగ్స్‌లో 5 సిక్సర్లు, 4 ఫోర్లు ఉన్నాయి. అలాగే జోస్ బట్లర్ హాఫ్ సెంచరీతో మెరిశాడు. వాషింగ్టన్ సుందర్ కూడా తన తొలి అర్ధశతకాన్ని నమోదు చేశాడు.

కాగా రెండో ఇన్నింగ్స్‌లో గుజరాత్ టైటాన్స్ విజయంలో మిస్టర్ స్పిన్నర్ రషీద్ ఖాన్ కీలక పాత్ర పోషించాడు. నాలుగు ఓవర్లలో కేవలం 17 పరుగులు మాత్రమే ఇచ్చి కీలక బ్యాటర్లు నితీశ్ రాణా, సమీర్ రిజ్వి, అక్షర్ పటేల్ వికెట్లు తీసి మ్యాచ్‌ను గుజరాత్ వైపు మళ్లించాడు. ఈ మ్యాచ్‌లో లాస్ట్ బాల్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన పోరులో గుజరాత్ జట్టు చివరికి ఒక్క పరుగుతో విజయం సాధించింది.

# సినిమాల్లోకి హిట్ మ్యాన్.. రోహిత్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీతో సరికొత్త చర్చ

**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ క్రికెటర్, మాజీ కెప్టెన్ హిట్ మ్యాన్ రోహిత్ శర్మ సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ , ముంబై ఇండియన్స్ లోగోలతో ఉన్న ఒక స్క్రిప్ట్ ఫోటోను షేర్ చేస్తూ అభిమానులకు పెద్ద సర్‌ప్రైజ్ ఇచ్చాడు.




**ఏమిటా 'డ్రాఫ్ట్ #45':**

రోహిత్ శర్మ షేర్ చేసిన ఫోటోలో 'ఐత్ఝట్ ఛ45' అని రాసి ఉన్న ఒక స్క్రిప్ట్ కనపడుతుంది. దాంతో ఈరో తేదీ (ఏప్రిల్ 9, 2026) ఉండటంతో పాటు టైటిల్ చివరలో 'జఱ్రుఎజూఙశీఅ' అనే పదం క్లియర్ గా కనిపిస్తోంది. ఇది హిట్ మ్యాన్ జీవిత చరిత్ర (దీఱశీజూఱఎ) కావొచ్చని లేదా ముంబై ఇండియన్స్ జట్టు సాధించిన విజయాలపై తీస్తున్న డాక్యుమెంటరీ అయ్యే ఛాన్స్ ఉందని సోషల్ మీడియాలో ఫ్యాన్స్ తెగ చర్చించుకుంటున్నారు. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

**ఐపీఎల్ లో రోహిత్ దూకుడు:**

ఒకవైపు సినిమాల వార్తలు వినిపిస్తున్నప్పటికీ, రోహిత్ శర్మ మాత్రం ఐపీఎల్ 2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్ తరపున బిజీగా ఉన్నాడు. ఈ సీజన్ మొదటి మ్యాచ్‌లో కోల్‌కతాపై రోహిత్ 78 పరుగులు చేసి అదరగొట్టాడు. ఆ తర్వాత ఢిల్లీపై 35 పరుగులు చేసినప్పటికీ, రాజస్థాన్‌తో జరిగిన వర్షం ప్రభావిత మ్యాచ్‌లో కేవలం 5 పరుగులకే అవుట్ అయ్యాడు. ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రోహిత్ 118 పరుగులు చేసి, అత్యధిక పరుగులు చేసిన టాప్-5 బ్యాటర్ల జాబితాలో కొనసాగుతున్నాడు.

**ముంబై ఇండియన్స్ ప్రస్తుత పరిస్థితి:**

ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టు ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో కొనసాగుతుంది. మొదటి మ్యాచ్ గెలిచినప్పటికీ, ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. టీమ్ మళ్ళీ విజయాల బాట పట్టాలంటే రోహిత్ శర్మ తన పాత ఫామ్‌ను అందుకోవాలని క్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు. ఇక మైదానంలో బౌలర్లను భయపెట్టే రోహిత్, ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తాడో అనేది వేచి చూడాలి. ఈ 'ఛాంపియన్' ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు త్వరలోనే బయటకు వచ్చే అవకాశం ఉంది.

# ఉత్కంఠ పోరులో లక్నో ఘన విజయం.. హోంగ్రౌండ్‌లో మళ్లీ ఓడిన కేకేఆర్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో 3 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్ ఘన విజయం సాధించింది. కాగా టాస్ ఓడి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కేకేఆర్ జట్టుకి ఆశించిన ఆరంభం లభించలేదు.. 15 పరుగుల వద్ద ఓపెనర్ ఫిన్ అలెన్ (9) ఔట్ అయ్యాడు. అనంతరం రహానే-- రఘువంశీ నెలకొల్పిన 84 పరుగుల అద్భుతమైన భాగస్వామ్యాన్నికి బ్రేక్ పడింది. 99 పరుగుల వద్ద రహానే (41) డగౌట్ కి వెళ్లగా, ఆ తర్వాత రఘువంశీ (45), రింకు సింగ్ (4) వరుసగా పెవిలియన్ కి క్యూ కట్టారు. కానీ చివర్లో రోవ్‌మన్ పావెల్ (39), కామెరూన్ గ్రీన్ మరో 50 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించడంతో 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 182 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ఆటగాడు ఆయూష్ బదోనీ, ముకుల్ చౌదరీ అద్భుతమైన హాఫ్ సెంచరీలతో చెలరేగారు. అంతకుముందు, లక్నో ఓపెనర్లు ఐడెన్ మార్క్రమ్-- మిచెల్ మార్ష్ జోడి మంచి ఆరంభాన్ని అందించారు. వీరిద్దరి మధ్య నెలకొన్న 41 పరుగుల పార్ట్నర్ షిప్ ని వైభవ్ ఆరోరా బ్రేక్ చేశాడు. మార్ష్ (15)కి సంధించిన ఓ సూపర్బ్ బంతిని ఆడే క్రమంలో కీపర్ రఘువంశీకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కి వెళ్లిపోయాడు. ఆ తర్వాత కాసేపటికే మార్క్రమ్ (22) బ్యాటింగ్ లో స్పీడ్ పెంచే క్రమంలో వైభవ్ ఆరోరా బౌలింగ్ లో భారీ షాట్ ఆడగా ఆది నేరుగా బౌండరీ లైన్ వద్ద ఉన్న రోవ్‌మన్ పావెల్ చేతిలో పడటంతో అతడు క్రీజు నుంచి వెనుదిరిగాడు. ఇక మైదానంలోకి వచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్ మరోసారి విఫలమయ్యారు. కేవలం 10 పరుగులు మాత్రమే చేసి కామెరూన్ గ్రీన్ బౌలింగ్ లో పంత్ డగౌట్ కి వెళ్లిపోయాడు.

అనంతరం బ్యాటింగ్ కి వచ్చిన నికోలస్ పూరన్ మరోసారి తీవ్ర నిరాశ పరిచాడు. కేవలం 13 పరుగులు చేసి కార్తిక్ త్యాగి బౌలింగ్ లో రమణ్ దీప్ సింగ్ కి క్యాచి ఇచ్చి పూరన్ పెవిలియన్ కి వెళ్లిపోయాడు. ఆ తర్వాత వచ్చిన అబ్దుల్ సమద్ (2) సైతం పెద్దగా రాణించలేదు.. అనుకూల్ రాయ్ వేసిన ఓ కిరాక్ బంతికి క్లిన్ బౌల్డ్ అయ్యాడు. వరుసగా వికెట్లు పడుతున్నప్పటికీ ఆయూష్ బదోనీ ( 34 బంతుల్లో 7 ఫోర్లు 2 సిక్సులతో 54 పరుగులు) మాత్రం హాఫ్ సెంచరీ చేసి జట్టుని గెలుపు దిశగా నడిపిస్తున్న క్రమంలో అనుకూల్ రాయ్ బౌలింగ్ లో రింకు సింగ్ కి క్యాచ్ ఇచ్చి మైదానం వీడాడు. ఆ తర్వాత బ్యాటింగ్ కి వచ్చిన మహ్మద్ షమీ (1)ని సునీల్ నరైన్ ఔట్ చేశాడు. చివర్లో బ్యాటింగ్ కి వచ్చిన ముకుల్ చౌదరి చెలరేగిపోయాడు. కేవలం 27 బంతుల్లోనే సూపర్బ్ (54 నాటౌట్) అర్థ శతకం బాదేశాడు. ముకుల్ ఇన్నింగ్స్ లో ఏకంగా 7 సిక్సులు 2 ఫోర్లు ఉన్నాయి. ముకుల్ బ్యాటింగ్ దెబ్బకి కేకేఆర్ చిత్తుగా ఓడిపోయింది. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా, అనుకూల్ రాయ్ చెరో రెండు వికెట్లు తీసుకోగా, సునీల్ నరైన్, కార్తీక్ త్యాగి, కామెరాన్ గ్రీన్ తలో వికెట్ పడగొట్టారు.

# ఎల్లో డ్రెస్‌లో కృతి శెట్టి.. కిర్రాక్ లుక్ వైరల్!







తెలుగు సినీ ప్రేక్షకులకు 'బేబమ్మ'గా బాగా దగ్గరైన కృతి శెట్టి, తనదైన నటనతోనూ, అందంతోనూ తక్కువ కాలంలోనే గుర్తింపు తెచ్చుకుంది. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ తన లేటెస్ట్ ఫోటోలను అభిమానులతో పంచుకునే కృతి, ప్రతీసారి తన డ్రెస్సింగ్ స్టైల్‌తో ఆకట్టుకుంటూనే ఉంటుంది. లేటెస్ట్ గా ఆమె షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

క్లాస్ మాస్ ప్రేక్షకులను సమానంగా ఆకట్టుకునేలా ఆమె ఈ ఫోటోషూట్‌లో మెరిసింది. ఈ లాంగ్ పసుపు గౌన్ ఆమెకు చాలా స్టైలిష్ లుక్‌ను ఇచ్చింది. స్లీవ్‌లెస్ టాప్‌తో కూడిన ఈ డ్రెస్ డిజైన్ ఆమె గ్లామర్‌ను మరింత ఎలివేట్ చేసింది. ముఖ్యంగా డ్రెస్‌కు ఉన్న కట్ ఆమె లుక్‌కు ఒక మోడ్రన్ టచ్ ఇచ్చింది. ఎక్కడా అతిగా అనిపించకుండా, చాలా హుందాగా కనిపిస్తూనే తనలోని గ్లామర్ యాంగిల్‌ను ఈ ఫోటోల ద్వారా హైలెట్ చేసింది. తన హెయిర్ స్టైల్ మినిమమ్ మేకప్‌తో ఆమె సహజ సిద్ధమైన అందాన్ని ప్రదర్శించింది. ఈ ఫోటోలలో కృతి ఇచ్చిన పోజులు చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాయి. కిటికీ పక్కన నిలబడి ఆకాశం వైపు చూస్తున్నట్లుగా ఇచ్చిన స్టిల్స్, ఆమెలోని విభిన్నమైన ఎక్స్‌ప్రెషన్స్‌ను తెలియజేస్తున్నాయి. చెవికి పెట్టుకున్న చిన్నపాటి జుమ్కీలు తప్ప మరే ఇతర భారీ ఆభరణాలు వాడకుండా తన డ్రెస్‌నే హైలైట్ చేసింది. వైట్ కలర్ హీల్స్ ఆమె మొత్తం కాస్ట్యూమ్‌కు పర్ఫెక్ట్ కాంబినేషన్‌గా నిలిచాయి.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్దిసేపటికే వేలల్లో లైకులు, కామెంట్లు వచ్చాయి.

ఇక ఉప్పెన సినిమాతో ఆమె అందుకున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. తొలి చిత్రంతోనే వంద కోట్ల వసూళ్లను సాధించిన హీరోయిన్‌గా రికార్డు సృష్టించింది. ఆ తర్వాత 'శ్యామ్ సింగరాయ్', 'బంగార్రాజు' వంటి చిత్రాలతో వరుస విజయాలను అందుకుంది. అయితే, గత కొంతకాలంగా ఆమెకు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయి విజయాలు దక్కలేదు. అయినప్పటికీ, ఆమె క్రేజ్ మాత్రం తగ్గలేదు. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, మలయాళ చిత్రాల్లోనూ అవకాశాలు దక్కించుకుంటూ తన పరిధిని విస్తరించుకుంటోంది. నెక్ట్స్ తమిళంలో ఆమె నటించిన ౫ాఞఖ సినిమా రిలీజ్ కానుంది.

ప్రస్తుతం కృతి శెట్టి తన దృష్టిని వైవిధ్యమైన పాత్రలపై పెట్టింది. గ్లామర్ రోల్స్ మాత్రమే కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంచుకుంటోంది. కన్నడలో కూడా కొన్ని క్రేజీ ప్రాజెక్టులలో ఆమె భాగమైనట్లు సమాచారం. ఒక హీరోయిన్‌గా నిలదొక్కుకోవడానికి కావలసిన అన్ని అర్హతలు ఉన్న కృతి, ఒక బలమైన సక్సెస్ కోసం ఎదురుచూస్తోంది. సోషల్ మీడియా ద్వారా తన ఫాలోయింగ్‌ను నిలబెట్టుకుంటూనే, తనలోని సరికొత్త లుక్స్‌ను ఎప్పటికప్పుడు పరిచయం చేస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965